
# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



తెలంగాణ ఎడిటర్ విప్పల చంద్రశేఖర్ | శనివారం | 04.01.2025 | పేజీలు : 08 | నమూన సంచిక | వెల : అమూల్యం


# ఆర్ఆర్ఆర్‌కు భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి

- రైతులకు మెరుగైన పరిహారం అందేలా చూడాలి...
- పంట పొలాలకు సులువుగా చేరేలా ఎన్‌హెచ్‌ల్లో అండర్‌పాస్‌లు నిర్మించాలి
- ఆర్ అండ్ బీ, అటవీ శాఖ సమన్వయంతో ముందుకు సాగాలి..
- మూడేళ్లలో హ్యామ్‌లో రహదారుల నిర్మాణం పూర్తి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్:

ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రైతులకు పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఆర్బిట్రేటర్లుగా ఉన్న జిల్లా కలెక్టర్లు వీలైనంత ఎక్కువ మొత్తంలో రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారుల భూ సేకరణ, పరిహారం, హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటి మోడల్) విధానంలో రహదారుల నిర్మాణం, రేడియల్ రోడ్ల నిర్మాణాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. భూ సేకరణ మిగతా 2లో...

## గ్రామీణ రహదారులకు మహర్దశ..

- రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం...
- ప్రస్తుత అవసరాలకు తగినట్లు సింగిల్, డబుల్ రోడ్ల నిర్మాణం
- ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2 లో

## ఢిల్లీకి ఆపదగా ఆప్ ప్రభుత్వం

- ఈ సారి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి
- 1,675 నివాస సముదాయాలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- అరవింద్ కేజ్రీవాల్ టార్గెట్‌గా ఘాటు వ్యాఖ్యలు



2 లో

## నాంపల్లిలో నుమాయిష్ సందడి

మొదలైన హైదరాబాద్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం



హైదరాబాద్,ప్రజాభూమి

హైదరాబాద్ నాంపల్లిలో నుమాయిష్ సందడి మొదలైంది. ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 84వ అఖిల భారత వస్తు పారిశ్రామిక ప్రదర్శనశాలను రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. 1938లో నిజాం కాలంలో మొదలైన నుమాయిష్‌కు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి మిగతా 2లో...

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

- ఎన్‌కౌంటర్లలో ముగ్గురు మావోయిస్టులు మృతి



ఛత్తీస్‌గఢ్, ప్రజాభూమి

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. గరియాబాద్ జిల్లా ఇందగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సొర్నామల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోలు హతమయ్యారు. అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో స్థానిక పోలీసులు, ఎస్‌టీఎఫ్, మిగతా 2లో...

## త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు

- 180 కిమీ వేగంతో దూసుకు పోయేలా పరీక్షలు
- అన్ని పరీక్షల్లోనూ నెగ్గినట్లు గుర్తింపు
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వీడియో వైరల్



న్యూఢిల్లీ,ప్రజాభూమి

త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు కూడా మనలను పలకరించ బోతున్నాయి. ఇప్పటికే వందేభారత్ రైళ్లు సంచలనంగా మారడంతో పాటు, ప్రయాణికులు కూడా బాగా ఆదరిస్తున్నారు. రైల్వేల చరిత్రలో ఇవి విప్లవాత్మకంగా మారయి. ఈ క్రమంలో దేశంలో మొట్టమొదటిసారిగా వందే భారత్ స్లీపర్ రైళ్లను పట్టాలు ఎక్కించేందుకు రైల్వే శాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే రైలు వేగాన్ని క్రమక్రమంగా పెంచేందుకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ వీడియోను షేర్ చేశారు. అందులో వందేభారత్ స్లీపర్ రైలు 180కిలోమీటర్ల వేగంతో రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లింది. అంత వేగంలోనూ రైల్లో సీటు వద్ద ఉన్న ట్రేపై మిగతా 2లో..

## కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల సమ్మె విరమణ

- సమస్యలపై టీచర్లతో మంత్రి సీతక్క చర్చలు సఫలం
- నేటి నుంచి విధుల్లో చేరుతామని అధ్యాపకుల వెల్లడి



హైదరాబాద్,ప్రజాభూమి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లతో మంత్రి సీతక్క చర్చలు సఫలం అయ్యాయి. మంత్రి సీతక్క విజ్ఞప్తి మేరకు సమ్మె విరమిస్తున్నట్లు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు ప్రకటించారు. శనివారం నుంచి విధుల్లో చేరుతున్నట్లుగా కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు ప్రకటించారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ మినహా అన్ని డిమాండ్లకు సానుకూలంగా ప్రభుత్వం స్పందించింది. ప్రతినెలా ఐదో తేదీ లోపు జీతాలు, మహిళా మిగతా 2లో..

## అధికారమత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారు

- పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్ల మొసలి కన్నీళ్లు
- బిసి బిడ్డ ఈటెల రాజేందర్‌ను మెడపట్టి గెంటారు
- కవిత బిసి డిక్లరేషన్‌పై మంత్రి పొన్న ప్రభాకర్ ఎద్దేవా



హైదరాబాద్,ప్రజాభూమి

అధికారమత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారని... పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్ల మొసలి కన్నీళ్లు పెట్టుకుంటున్నారని...బిసి బిడ్డ ఈటెల రాజేందర్‌ను మెడపట్టి గెంటిన విషయం మరచి పోయారన,కవిత బిసి డిక్లరేషన్‌పై మంత్రి పొన్న ప్రభాకర్ ఎద్దేవా చేశారు. బీసీ డిక్లరేషన్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బీసీల కోసం మాట్లాడు తున్నందుకు సోదరి కవితకి అభినందనలు అని మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

సీఆర్‌పీఎఫ్ జవాన్లు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఒడిశాలోని నవరంగపూర్‌కు చెందిన సైనికులు కూడా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు నక్సలైట్లు హతమైనట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు తెలిపారు.

## నాంపల్లిలో నుమాయిష్ సందడి



మొదటిపేజీ తరువాయి

సందర్శకులు వస్తారు. సందర్శకుల సౌకర్యార్థం ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీభవన్, అజంతా, గోషామహల్ గేట్‌లను అందుబాటులో ఉంచింది. సీసీ కెమెరాలు, భద్రతా బలగాలతో పాటు.. సందర్శకులు మైదానంలో తిరిగేందుకు ఏర్పాట్లు చేశారు. జమ్మూకశ్మీర్ డ్రై ఫ్రూట్స్, హ్యాండ్ క్రాఫ్ట్స్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి హస్తకళ వస్తువులు ప్రదర్శనలో ఉంటాయి. దేశంలోని అత్యుత్తమ బ్రాండ్ల ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు అన్ని రకాల స్టాల్స్ అందుబాటులో ఉంటాయి. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, వారాంతాలు, సెలవు రోజుల్లో రాత్రి 11 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు

మొదటిపేజీ తరువాయి

పెట్టిన గ్లాసులో చుక్క నీరు కూడా కింద పడకపోవడం విశేషం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సూచనల మేరకు రాజస్థాన్‌లోని కోటా రైల్వే డివిజన్‌లో ఈ పరీక్షలు నిర్వహించారు. తొలుత జనవరి 1న రైలును 130 కి.మీ వేగంతో నడిపారు. ఆ తర్వాత వేగాన్ని 140, 150, 160కి పెంచారు. తాజాగా గురువారం ఈ వేగాన్ని గంటకు 180 కిలోమీటర్లకు పెంచారు. రాజస్థాన్‌లోని కోటా నుంచి లబాన్ స్టేషన్ల మధ్య 180 కిమీ వేగంతో దూసుకెళ్లింది. ఆ సమయంలో సాధారణ ప్రయాణికులను సమం చేసేంత బరువును రైల్లో ఉంచారు. విభిన్నమైన ట్రాక్ పరిస్థితుల్లో దీన్ని పరీక్షించారు. వచ్చే నెలలోనూ ఈ ట్రయల్స్ కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. మరికొన్ని నెలల్లో వందే భారత్ స్లీపర్ రైళ్లను పట్టాలెక్కించే అవకాశాలున్నాయి. ఈ స్లీపర్ రైల్లో మొత్తం 16 బోగీలు ఉంటాయని అందులో 10 థర్డ్ ఏసీకి, 4 సెకండ్ ఏసీకి, ఒక బోగీ ఫస్ట్ ఏసీకి కేటాయించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ స్లీపర్ రైలులో సీటింగ్‌తో పాటు లగేజీ కోసం రెండు బోగీలు అందుబాటులో ఉంటాయి. కొత్తగా సిద్ధం చేసిన వందేభారత్ స్లీపర్ కోచ్ రైలు పరీక్షల నిమిత్తం ఇటీవల కోటకు వచ్చింది. అక్కడ దానిపై బరువు ఉంచి, వేర్వేరు వేగంతో ఖాళీగా రన్ చేయడం ద్వారా పరీక్షించారు. అందులో బ్రేకింగ్ సిస్టమ్, ఎయిర్ సస్పెన్షన్, కప్లర్ ఫోర్స్‌లను పరీక్షించారు. ఈ రైలును గంటకు 180 కి.మీ వేగంతో నడిపారు. ఈ పరీక్ష డిసెంబర్ 31 నుంచి కోట రైల్వే డివిజన్‌లోని ఢిల్లీ–ముంబై రైల్వే ట్రాక్‌పై ప్రారంభమైంది. ఇందులో వందే భారత్ ట్రయల్ మొదట నాగ్డా మధ్య.. తర్వాత సవాయి మాధోపూర్, కోట మధ్య నిర్వహించబడుతోంది. ఈ పరీక్షల అనంతరం పూర్తి నివేదికను రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డుకు పంపనుంది. కోటా నాగ్డా రైల్వే సెక్షన్‌లోని రోహల్ ఖుర్ద్, చౌమహ్లా మధ్య మొదట్లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులతో సమానమైన బరువుతో నడిచింది. ఇందులో మొదట్లో 130, తర్వాత 140, తర్వాత 150 స్పీడ్‌తో ట్రయల్‌ను తీసుకున్నారు. దీని తర్వాత రైలును జనవరి 1న 160 వేగంతో, రోహల్ ఖుర్ద్ విక్రమ్‌ఘర్‌లో 177 వేగంతో అదే ట్రాక్‌పై పరీక్షించారు. అలాగే రోహల్ ఖుర్ద్, కోటా మధ్య 40 కిలోమీటర్ల దూరంలో 180 కి.మీ వేగంతో రైలు ట్రయల్ చేశారు. ఇందులో భాగంగా వందేభారత్ స్లీపర్ టెస్టింగ్ మూడో రోజు గురువారం కూడా జరిగింది. దీని కింద కోటా నుంచి లాబన్ మధ్య 30 కిలోమీటర్ల దూరంలో ప్రయాణికుల సమాన బరువును ఉంచుతూ వందే భారత్ 180 కి.మీ వేగంతో నడపబడింది. ఇవి సక్సెస్ అయితే ఇక ప్రయాణగమ్యం తగ్గి ప్రయాణం సుఖవంతంకానుంది.

## కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల సమ్మె విరమణ

మొదటిపేజీ తరువాయి

టీచర్లకు 108 రోజుల ప్రసూతి సెలవులు, డెత్ బెనిఫిట్స్ మంజూరు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల సమస్యలపై మంత్రి సీతక్క చర్చించారు. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల ప్రతినిధుల తో మంత్రి సీతక్క సచివాలయంలోని తన పేషీలో శుక్రవారం భేటీ అయ్యారు. పెండింగ్ సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్కతో పాటు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉద్యోగ ప్రతీకరణ మినిమం టైం స్కేల్ డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి మరోసారి సమావేశం అవుదామని మంత్రి సీతక్క చెప్పారు. మంత్రి సీతక్కతో సమ్మె విరమిస్తున్నట్లు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు ప్రకటించారు.'మీరు మారండి.. సమాజాన్ని మార్చుదాం.. చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దుదాం' అని డీడబ్ల్యూలకు మంత్రి సీతక్క ఉద్బోధించారు. ప్రతి అంగన్వాడి కేంద్రాలకు బెల్స్ ప్రొవైడ్ చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయానికి బడి గంట మోగించిన తరహాలోనే అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు బెల్ మోగించాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి జిల్లా సంక్షేమ అధికారులు టీచర్లు ఆయాలతో సమావేశాలు నిర్వహించి లోటుపాట్లపై నివేదికలు సమర్పించాలని అన్నారు. ఎక్కడ లోపాలు లేకుండా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు కార్పొరేట్ ప్లే స్కూళ్లను మించిపోయేలా పని చేయాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఎల్కేజీ యూకేజీకి లక్షలు వసూలు చేస్తున్నారని అన్నారు. అందుకే అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ పాఠాలను బోధిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

## ఆర్ఆర్ఆర్‌కు భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతోనూ చర్చించాలని, తరచూ రైతులతో సమావేశమై.. ఆయా రహదారుల నిర్మాణాలతో కలిగే ప్రయోజనాలను వివరించడం ద్వారా భూ సేకరణను వేగవంతం చేయొచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆర్ఆర్ఆర్ (దక్షిణ)కు ఎన్‌హెచ్ఏఐ సూత్రప్రాయ ఆమోదం తెలిపినందున... హెచ్ఎండీఏతో అలైన్‌మెంట్ చేయించాలని సూచించారు. హైదరాబాద్‌ను కలిపే 11 రహదారులకు ఆటంకం లేకుండా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం అన్నారు. రేడియల్ రోడ్లకు సంబంధించి ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడం, పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉండడంతో పాటు అవుటర్ రింగు రోడ్డు, ఆర్ఆర్ఆర్ అనుసంధానంలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం మీదుగా సాగే నాగ్‌పూర్–విజయవాడ (ఎన్‌హెచ్–163జీ) రహదారి, ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల రహదారి (ఎన్‌హెచ్–63), జగిత్యాల–కరీంనగర్ (ఎన్‌హెచ్ 563) రహదారుల నిర్మాణంతో పాటు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల (ఎల్‌డబ్ల్యూఎఫ్) రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, అటవీ అనుమతుల్లో అడ్డంకుల తొలగింపునకు సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే రహదారుల నిర్మాణంలో అటవీ శాఖ ఎందుకు కొర్రీలు పెడుతోందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (పీసీసీఎఫ్) డోబ్రియల్‌ను సీఎం ప్రశ్నించారు. గతంలో కొన్ని నిబంధనలు పాటించకపోవడంతో సమస్యలు ఉన్నాయని పీసీసీఎఫ్ బదులిచ్చారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తామని, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వెంటనే నివేదిక రూపంలో సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఆర్ అండ్ బీ, అటవీ శాఖ నుంచి ఒక్కో అధికారిని ప్రత్యేకంగా ఈ సమస్యల పరిష్కారానికి కేటాయించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారితో పది రోజులకోసారి సమీక్షించి త్వరగా క్లియరెన్స్ వచ్చేలా చూడాలని, ఇక్కడ కాకపోతే ఆర్ అండ్ బీ, అటవీ శాఖ మంత్రులు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి, అధికారులతో సమావేశమై అనుమతులు సాధించాలని సీఎం సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అండర్ పాస్‌ల నిర్మాణాన్ని విస్మరిస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆ సమస్య ఎదురుకాకుండా నిర్మాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రైతులు కిలోమీటర్ల కొద్దీ దూరం వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని సీఎం సూచించారు.

### హ్యామ్ విధానంలో...

రాష్ట్రంలో హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బీ పరిధిలో 12 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,700 కిలోమీటర్లు రహదారులు నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ రహదారుల నిర్మాణానికి సంబంధించి పాత జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ అనే తేడా లేకుండా ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇందుకు సంబంధించి కన్సల్టెన్సీల నియామకం, డీపీఆర్ ల తయారీ... రహదారుల నిర్మాణం విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. మూడేళ్లలో ఈ రహదారుల నిర్మాణం పూర్తికావాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టాలని, కూలిన వంతెలను వెంటనే నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు వెంటనే విడుదల చేసి, కేంద్రం నుంచి రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను పొందాలని ఆర్థిక శాఖ అధికారులకు సీఎం సూచించారు.

సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, జి.చంద్రశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు షానవాజ్ ఖాసీం, మాణిక్ రాజ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ రహదారులకు మహర్దశ..

**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్:**

రాష్ట్రంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.1000 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటాయించారు. ఈ రహదారుల నిర్మాణానికి ఈ నెల నుంచి నెలకు రూ.150 కోట్ల చొప్పున జూన్ నెలాఖరు నాటికి రూ.వెయ్యి కోట్లు విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖలపై సచివాయలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ రహదారులకు సంబంధించి సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గత కాలంలోని ఎడ్ల బండ్లు, సైకిళ్లు, మోటార్ సైకిళ్ల రాకపోకలకు అనుగుణంగా సింగిల్ లైన్, డబుల్ లైన్ రోడ్ల వెడల్పును నిర్ణయించారన్నారు. ప్రస్తుతం మారుమూల పల్లెల్లోనూ కార్లు, ట్రాక్టర్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు తిరుగుతున్నందున వాటి రాకపోకలకు వీలుగా ఆయా రహదారుల కొలతలను పునఃనిర్వచించాల్సి ఉందన్నారు. ఆయా వాహనాలు ఆటంకాలు లేకుండా సాగిపోయేందుకు వీలుగా రహదారులను నిర్మించాలన్నారు. తండాలు, గూడేలను పంచాయతీలు చేసినా వాటికి రహదారులు, పంచాయతీ, పాఠశాల భవనాల నిర్మాణాలను విస్మరించారని సీఎం అన్నారు. రాష్ట్రంలో ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. బీటీ రోడ్డు లేని పంచాయతీ ఉండకూడదన్నారు. గ్రామాల నుంచి మండలాలకు సింగిల్ రోడ్లు, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు కచ్చితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గుంతలు పడిన రహదారులకు వెంటనే మరమ్మతులు ప్రారంభించాలని సీఎం అన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రహదారుల నిర్మాణ ప్రమాణాల్లో తేడాలు ఉన్నాయని.. ఇక ముందు అలా ఉండడానికి వీల్లేదని సీఎం అన్నారు. రెండు శాఖల పరిధిలోని ఒకే రకమైన నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలని సీఎం సూచించారు. వాహనదారులు తాము ప్రయాణించేది పీఆర్ రోడ్డా.. ఆర్ అండ్ బీ రోడ్డా అనే విషయాన్ని పట్టించుకోరని.. కేవలం ప్రయాణం ఎలా సాగుతుందనేది ప్రధానమన్నారు. అటవీ ప్రాంతాల్లోని గ్రామాలకు సైతం రహదారులు నిర్మించాలని సీఎం సూచించారు.

## ఢిల్లీకి ఆపదగా ఆప్ ప్రభుత్వం

**ఢిల్లీ, ప్రజాభూమి**

గత దశాబ్దకాలంగా ఢిల్లీని ఆమ్ ఆద్మీ సర్కార్ నాశనం చేసిందని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1,675 గృహాలను ఢిల్లీలోని స్లమ్ ప్రాంతాల్లో ప్రారంభించిన ప్రధాని మోదీ అరవింద్ కేజ్రీవాల్ టార్గెట్‌గా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టివేసి అవినీతిని ప్రోత్సహించిందని దుయ్యబట్టారు. తాను అనుకుంటే అద్దాల మేడ కట్టుకునేవాడినని.. అయితే తాను పేదల గురించి ఆలోచించి వారికోసం 4 కోట్ల గృహాలను నిర్మించాలని తలచి పూర్తి చేసినట్లు ప్రధాని మోదీ అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం కోసం భారీస్థాయిలో ఖర్చు చేశారన్న ఆరోపణలను ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సింగ్ అధికారిక నివాసం కోసం అత్యంత ఖరీదైన గ్యాడ్జెట్స్, పరికరాలను వినియోగించినట్లు అక్టోబరు నెలలో ప్రజాపనుల శాఖ విడుదల చేసిన లేఖలో ఉంది. ఈ పరికరాల కొనుగోలు కోసం కొన్ని కోట్లు వెచ్చించినట్లు సమాచారం. ఈ అంశమే ఢిల్లీ ఎన్నికల వేళ అధికారిక ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిపక్ష బీజేపీ మధ్య హాట్ టాపిక్‌గా నిలిచింది. చిన్న గ్యాప్ దొరికితే చాలు బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీని, అరవింద్ కేజ్రీవాల్‌ను టార్గెట్ చేస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

ఇక ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఘాటు కౌంటర్ ఇచ్చారు.ఢిల్లీలో బీజేపీ జోక్యాన్ని అరవింద్ కేజ్రీవాల్ తప్పుబట్టారు. అంతేకాదు మోదీ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ అవి తన వ్యక్తిగతమైనవని పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యనందించడంలో సరికొత్త రికార్డు సృష్టించిందని, ఆరోగ్య వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చిందని, వనరులను అభివృద్ధి చేసిందని కేజ్రీవాల్ గుర్తు చేశారు.ఇవన్నీ బీజేపీ హయాంలో ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ గత పదేళ్లలో ఢిల్లీకి ఏం చేయలేదని అన్నారు కేజ్రీవాల్.2022 నాటికి శాశ్వత గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ.. ఐదేళ్లలో కేవలం 4700 ఇళ్లు మాత్రమే నిర్మించిందని గుర్తు చేశారు. అదే ఆప్ ప్రభుత్వంలో 22వేల తరగతులు, మూడు కొత్త యూనివర్సిటీలు, లెక్కలేనన్ని అభివృద్ధి పనులు చేసి చూపామని చెప్పారు.బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో మెరుగైన వనరుల అభివృద్ధికి కృషి చేసిందని ప్రధాని మోదీ అన్నారు.ఈ సందర్భంగా ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అశోక్ విహార్‌లో ఉన్న సీతు స్లమ్ రీహాబిలిటేషన్ ప్రాజెక్ట్ కింద నిర్మితమైన ఇళ్ల తాళాలను లబ్ధిదారులకు లేదా అర్హులకు ప్రధాని మోదీ అందజేశారు. ఈ ఇళ్ల కోసం వారు సాధారణ నిర్మాణపు ఖర్చును మాత్రమే భరించారు. ఇక ఇదే సమయంలో ప్రధాని మోదీ నౌరోజీ నగర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, సరోజినగర్‌లో రెసిడెన్షియల్ క్వార్టర్స్‌ను ప్రారంభించారు. మురికివాడలను కూల్చేసి వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా బీజేపీ వ్యవహరించిందని అర వింద్ కేజ్రీవాల్ మండిపడ్డారు. బీజేపీకి ఓటు వేస్తే ఢిల్లీలోని మురికివాడలన్నిటినీ కూల్చివేసేవారని అన్నారు. ఢిల్లీని నిజంగా నాశనం చేసింది బీజేపీనే అని కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అధికారమత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

అన్నారు. నాయ కత్వం మధ్య గ్యాప్ ఉందనే కవిత మీటింగ్ పెట్టారని వ్యాఖ్యలు చేశారు. కవిత గతంలో బతుకమ్మ, తర్వాత జాగృతి ఇప్పుడు బీసీ నినాదం అందుకున్నారన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..కొందరికి అధికారం మత్తు దిగి మస్తు గుర్తుకొస్తాయంటూ సెటైర్ విసిరారు. బీఆర్ఎస్ తమ పార్టీ పదవుల్లో బీసీలకు అవకాశమివ్వాలన్నారు. పార్టీ ఓనర్లలో తాను ఒకడిని అని ఈటెల రాజేందర్ అన్నందుకు మెడలు పట్టి బయటకి పంపారని విమర్శించారు. కవిత చేసే పనికి కొంత సంతోషం, కొంత బాధ కలుగుతోందన్నారు. పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్లు ఈరోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వకుండా తొక్కి పెట్టిన వాళ్లు ఈరోజు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మా పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయమైతే పార్టీలో చర్చిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగితే మాట్లాడే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. బీసీల శక్తి గుర్తించారు కాబట్టే కవిత బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కవిత మీటింగ్‌కు జనాల కోసం బ్రతిమాలాడుతున్నారని సెటైరికల్ కామెంట్స్ చేశారు. న్నికల సమయంలో తప్పా బీఆర్ఎస్ బీసీల కోసం ఏమైనా చేసిందా అని నిలదీశారు. ప్రగతి భవన్‌కు జ్యోతి రావ్ పూలే పేరు పెట్టుకున్నామని.. సావిత్రి భాయి పూలే జయంతిని మహిళా టీచర్ల దినంగా ప్రకటించామని తెలిపారు. కులగణన రిపోర్ట్ పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవరెంతో వారికి అంత అని రాహుల్ గాంధీ చెప్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీసీలను ఉపయోగించుకుంటే ఊరుకోమని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## పింఛన్‌దారులకు ఈపీఎఫ్ఓ గుడ్‌న్యూస్

### - ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్ పొందేలా చర్యలు

**న్యూఢిల్లీ,ప్రజాభూమి**

ఈపీఎస్ పింఛన్‌దారులకు ఈపీఎఫ్ఓ గుడ్‌న్యూస్ చెప్పింది. దేశంలోని ఎక్కడి నుంచైనా, ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్ తీసుకునేందుకు వీలు కల్పించింది. ఇందుకోసం తీసుకొచ్చిన సెంట్రలైజ్డ్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్‌నుదేశంలోని అన్ని ప్రాంతీయ కార్యాలయాలకు విస్తరించినట్లు కార్మిక మంత్రిత్వశాఖ తెలిపింది. దీనివల్ల 68 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనకరమని పేర్కొంది. ప్రస్తుతం పెన్షన్ పంపిణీ వ్యవస్థలో డీసెంట్రలైజ్డ్ వ్యవస్థ ఉంది. దీని వల్ల ప్రస్తుతం ఈపీఎఫ్ఓ జోనల్/ప్రాంతీయ కార్యాలయాలు కేవలం 3–4 బ్యాంకులతో మాత్రమే ఒప్పందాలు కలిగి ఉన్నాయి. దీంతో పింఛను ప్రారంభ సమయంలో పింఛనుదారులు ధ్రువీకరణ కోసం సంబంధిత బ్యాంక్‌కు వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. కొత్తగా తీసుకొచ్చిన సెంట్రలైజ్డ్ విధానం వల్ల బ్రాంచ్‌ను సందర్శించాల్సిన అవసరం తప్పింది. అంతేకాదు పింఛన్ విడుదలైన వెంటనే ఆ మొత్తం ఖాతాలో జమ అవుతుంది. సెంట్రలైజ్డ్ వ్యవస్థ వల్ల పెన్షనర్లు దేశంలోని ఏ ప్రాంతానికి మారినా ఇబ్బంది ఉండదు. ఒక ఆఫీసు నుంచి ఇంకో ఆఫీసుకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్‌ను బదిలీ చేయాల్సిన అవసరం లేదని కార్మిక శాఖ తెలిపింది. ఏ బ్యాంక్‌కు చెందిన ఏ శాఖ నుంచైనా పింఛన్ పొందే వీలుంటుందని తెలిపింది. ముఖ్యంగా రిటైర్మెంట్ తర్వాత సొంత ప్రాంతాలకు తరలివెళ్లే వారికి సెంట్రలైజ్డ్ వ్యవస్థ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. తొలుత అక్టోబర్‌లో దీన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. నవంబర్‌లో రెండో దశ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టారు. జనవరి 1 నుంచి పూర్తి స్థాయిలో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

## తెలుగులోనూ ఇక ప్రభుత్వ ఉత్తర్వులు

**అమరావతి,ప్రజాభూమి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని నిర్ణయించింది. ఆంగ్లం, తెలుగు.. రెండు భాషల్లోనూ ఉత్తర్వులు ఇవ్వాలని ఈ మేరకు వివి ధ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. మొదట ఆంగ్లంలో ఉత్తర్వులు ఇచ్చి అప్‌లోడ్ చేయాలని.. రెండు రోజుల్లోగా తెలుగులోనూ అవే ఉత్తర్వుల జారీకి చర్యలు తీసుకోవాలని వివిధ శాఖలకు సాధారణ పరి పాలన శాఖ సూచించింది. ఉత్తర్వుల అనువాదానికి డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ సేవలు విని యోగిం చుకోవాలని తెలిపింది. ఈ మేరకు జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. పాలనా వ్యవహారాలు, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే జారీ చేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల విజయవాడలో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభ తీర్మానించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్లకవులు, రచయితలు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

# మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే స్ఫూర్తి

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి
- జ్యోతిబా పూలే జయంతి అంటే ఆడబిడ్డల పండుగ : ఎంఎల్‌సీ కవిత



హైదరాబాద్, ప్రజాభూమి

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆమె కోరారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్‌లో నిర్వహించిన బీసీ సంఘాల మహాసభలో ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే సతీమణి సావిత్రిబాయి పూలే 194వ జన్మదినమని, దేశంలోని ఆడబిడ్డలందరికీ నేడు పండగ దినమని కవిత చెప్పారు. సావిత్రబాయి పూలే పులి బిడ్డ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. "సావిత్రిబాయిపూలే ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. చరిత్ర తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తు నిర్మాణం చేస్తారన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో బీసీలకు ఏం జరిగిందో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. చాలా మంది కులం లేదని, కులరహిత సమాజం నిర్మిస్తామని గొప్పగొప్ప మాటలు చెప్తారు, కానీ భారతదేశంలో కులాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కులాల ఆధారంగానే జీవిస్తున్నారన్నారు. అందుకే ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం రాసిన పెద్దలు కొన్ని హక్కులు కల్పించారని కవిత గుర్తు చేశారు. రాజ్యాంగం రాసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు దేశ ప్రజలందరూ చేతిలెత్తి మెక్కాలన్నారు. ఆయన హక్కులు కల్పించకపోతే ఎస్సీ, ఎస్టీలకు ఇప్పటికీ ఎటువంటి ఫలాలు దక్కేవి కాదని పేర్కొన్నారు. అలాగే బీసీలోని అన్ని కులాలకు రాజ్యాంగంలో రక్షణ కల్పిస్తే బాగుండేదని అన్నారు. 1953లో అప్పటి ప్రధాని నెహ్రూ బీసీలపై అధ్యయనం చేయడానికి కాకా కాలేల్కర్ కమిషన్ వేశారని, పాపం ఆ పెద్దమనిషి రెండేళ్లు శ్రమించి రిపోర్టు ఇస్తే నెహ్రూ దాన్ని తిరస్కరించారన్నారు. ఇది చరిత్ర, కాదనలేని వాస్తవం. మండల్ కమిషన్ రిపోర్టును పదేళ్లపాటు బీరువాలో పెట్టారన్నారు. మండల్ కమిషన్ రిపోర్టును వీపీ సింగ్ అమలు చేస్తే ఆయన ప్రభుత్వాన్ని కూలగొట్టారని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం విచ్ఛినం అవుతుందని ఆనాడు రాజీవ్ గాంధీ చెప్పలేదా?. బీసీల కోసం పోరాడే మమ్మల్ని మీకు ఇప్పుడు బీసీలు గుర్తుకు వచ్చారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ద్రోహం చేసిందని" కవిత మండిపడ్డారు.

## కనకదుర్గమ్మ సేవలో ఎంపి అరుణ



విజయవాడ,ప్రజాభూమి

విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి రావటం ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. కుటుంబ సమేతంగా వచ్చామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి అయిన తరువాత రావాలని అనుకున్నామని.. మధ్యలో వరదలు వచ్చాయని.. అందుకే కొంత ఆలస్యం అయ్యిందని అన్నారు. అమ్మవారు విజయానికి ప్రతీక అని.. తనకు మంచి విజయం అందించారన్నారు. అమ్మవారి ఆశీర్వాదం తెలుగు ప్రజలు అందరికీ వుండాలని కోరుకున్నట్లు తెలిపారు. గతం కంటే ఇప్పుడు ఆలయం చాలా అభివృద్ధి చెందిందన్నారు. దర్శనం చాలా చక్కగా జరిగిందన్నారు. రాష్ట్రం విడిపోయినప్పటికి అందరికీ మంచి జరగాలి అని కోరుకున్నానన్నారు. చంద్రబాబు నాయుడు ఇక్కడ సీఎంగా ఉండి మంచి అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ఎన్డీఏలో ఉన్న సీఎం.. ఈ ప్రాంతం ఎమ్మెల్యే సుజన చౌదరి మంచి అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నట్లు ఎంపీ డీకే అరుణ వెల్లడించారు. ఇంకా.. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ఎంపీ డీకే అరుణ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన ఎంపీకి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు ఎంపీ. ఆశీర్వచనం అనంతరం లడ్డూ ప్రసాదాన్ని. అమ్మవారి చిత్రపటాన్ని ఎంపీ డీకే అరుణకు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో రామచంద్ర మోహన్ అందజేశారు.

## తెలంగాణలో పెరిగిన చలితీవ్రత

- ఆదిలాబాద్‌లో 7.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత




హైదరాబాద్,ప్రజాభూమి

తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అవుతున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తుండటంతో చలి తీవ్రత మరింత పెరిగిందని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీలకు పడిపోయిందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అత్యంత కనిష్ఠంగా హెచ్‌సీయూలో 8.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీహెచ్ఈఎల్ వద్ద 8.8, రాజేంద్రనగర్‌లో 9.4, మౌలాలీలో 9.6, శివరాంపల్లిలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ప్రజలు చలికి వణికిపోయారు. శుక్రవారం రాత్రి కూడా ఇలాగే ఉంటుందని, ఉష్ణోగ్రతలు అతి తక్కువకు పడిపోతాయని వాతావరణ శాఖ తెలిపింది.

## చైనాలో మరో వైరస్ వ్యాప్తి

- ఆస్పత్రులకు క్యూ కట్టిన జనం



న్యూఢిల్లీ,ప్రజాభూమి

చైనాలో మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని, ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల ఎదుట క్యూ కట్టారంటూ వస్తోన్న వార్తలు మరోసారి ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. 2001లోనే గుర్తించిన హ్యూమన్ మెటానిమోవైరస్... ప్రస్తుతం డ్రాగన్ దేశంలో వెలుగు చూస్తోన్న కేసులకు ఓ కారణం. చైనా ఉత్తర ప్రాంతంలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఆసియా దేశాలు కూడా దీనిపై దృష్టిసారించాయి. హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు దీనిబారిన పడే అవకాశాలు ఎక్కువని అంటున్నారు.

## ప్రజావాణికి మొత్తం 359 దరఖాస్తులు రాక

హైదరాబాద్,ప్రజాభూమి

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 359 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 103, విద్యుత్ శాఖ కు సంబంధించి 85, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 62, ఇతర శాఖలకు సంబంధించి 109 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు

## నీది నాలుకా..తాటి మట్టా

- కడియం వ్యాఖ్యలపై తాటికొండ ఆగ్రహం



జనగామ,ప్రజాభూవి

నీది నాలుక తాటి మట్టా.... అన్నం తింటున్నావా గడ్డి తింటున్నావా అంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాటలపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సంవత్సరాలు కేసీఆర్ కుటుంబంతో కూడి పొగిడిన వ్యక్తివి నువ్వు కాదా అని దుయ్యబట్టారు. అవకాశవాది నుంచి అవినీతి మాట రావడం సిగ్గుచేటు అని అన్నారు. కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న రేవంత్ రెడ్డి సానుభూతి పొందడానికే తన ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని రాజయ్య అన్నారు. కవితను అరెస్టు చేసిన రోజు రోడ్డుపై బైఠాయించి కవితను విడుదల చేయాలని ధర్నా చేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. నువ్వు చేసిన మోసానికి బీఆర్ఎస్ వాళ్లే కాదు.. కాంగ్రెస్ వాళ్లు కూడా తు తు అంటున్నారని తాటికొండ రాజయ్య ఆరోపించారు. ఇంకోసారి కేసీఆర్ కుటుంబం గురించి మాట్లాడితే జాగ్రత్త అని హెచ్చరించారు. నియోజకవర్గం లో 1100 మంది దళితులకు దళిత బంధు రాకుండా అడ్డుకున్న వ్యక్తివి నువ్వేనని తాటికొండ రాజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ద్రోహివి నువ్వు, దళితుల పాలిట రాబందు నువ్వు అని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. టీడీపీలో, బీఆర్ఎస్ లో మంత్రి పదవులు అనుభవించి అక్రమ ఆస్తులు సంపాదించుకున్నావని అన్నారు. 1994లో నీ ఆస్తులు ఎన్ని.. ఇప్పుడు నీ ఆస్తులు ఎన్ని అని ప్రశ్నించారు. అవినీతితో సంపాదించుకున్న వాడు ఎవడైనా సాక్షాలు పెట్టుకుంటాడా.. నీ ఇల్లు, నీ పెట్రోల్ బంక్, నూరు భూములు, విదేశాలలో ఉన్న నీ ఆస్తులన్నీ సాక్ష్యం కాదా అని తాటికొండ రాజయ్య ఆరోపించారు.

## పాఠశాలలకు ఆదివారాలు కాకుండానే తొమ్మిది సెలవులు



హైదరాబాద్,ప్రజాభూమి

కొత్త ఏడాది మొదటి నెలలోనే ఆదివారాలు కాకుండా ఏకంగా తొమ్మిది సెలవులు వచ్చాయి. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లోని పాఠశాలలకు 2025 జనవరిలో తొమ్మిది సెలవులు ఉండబోతున్నాయి. పబ్లిక్ హాలీడేస్, పండగ సెలవులు, జయంతి వేడుకలు అన్నీ కలిపి ఏకంగా తొమ్మిది రోజులపాటు సెలవులు రావడంతో విద్యార్థులు ఉబ్బితబ్బిపోతున్నారు. తెలంగాణ క్యాలెండర్ ప్రకారం జనవరి నెలలో నాలుగు సాధారణ సెలవులు ఉన్నాయి. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న, భోగి పండగ నేపథ్యంలో జనవరి 13న, సంక్రాంతి సందర్భంగా జనవరి 14, గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో జనవరి 26న సెలవులు ఉన్నాయి. ఈ సెలవుల్లో హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లోని అన్ని పాఠశాలలు మూసివేయనున్నారు. ఆదివారాలు, సాధారణ సెలవులు కాకుండా మరో మూడు ఆప్షనల్ హాలిడేస్‌ని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. హజ్రత్ అలీ జయంతి సందర్భంగా జనవరి 14న, కనుము నేపథ్యంలో జనవరి 15న, షబ్-ఎ-మెరాజ్ జన్మదినం సందర్భంగా జనవరి 25న ఆప్షనల్ హాలీడేస్ ఇచ్చింది. అలాగే సెకండ్ సాటర్ డే సందర్భంగా మరో సెలవు విద్యార్థులకు ఇవ్వనున్నారు. జనవరి 14న హజ్రత్ అలీ పుట్టినరోజు సెలవుదినం కాగా,అదే రోజుసంక్రాంతి పండగ వచ్చింది. అయితే తెలంగాణలోని అన్ని పాఠశాలలు ఆప్షనల్ హాలీడేస్ ప్రకారం మూసివేయరు. షబ్-ఎ-మెరాజ్ జయంతికి మైనారిటీ పాఠశాలలకు మాత్రమే సెలవు ఇవ్వనున్నారు. దీంతో ఆదివారాలు కాకుండా ఏకంగా 9 రోజులు విద్యార్థులకు సెలవులు వచ్చినట్లు అయ్యింది. ఇన్నేసి సెలవులు ఉండడంతో విద్యార్థులు ఎగిరి గంతేస్తున్నారు.

## రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ బొంద పెట్టింది

- రైతులు యాచించాలని రేవంత్‌రెడ్డి కుట్ర : కేటీఆర్



హైదరాబాద్,ప్రజాభూమి

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని బొంద పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతులు యాచించాలని రేవంత్ రెడ్డి అంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు..తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజు చేయాలని, వ్యవసాయాన్ని స్థిరికరించాలని, ఎవరూ ఆలోచించని విధంగా విప్లవాత్మకమైన పథకానికి రూపకల్పన చేశారు. రైతుల మీద ప్రేమ ఉండే నాయకుడు కాబట్టి.. కేసీఆర్ రైతుకు పెట్టుబడి ఇవ్వాలని ఆలోచన చేశారు. దాన్ని అమలు చేశారు. ఒకసారి కాదు.. వరుసగా 11 సీజన్లకు దరఖాస్తు, దండం పెట్టే అక్కర్లేకుండా.. నేరుగా వారి ఖాతాల్లో నిధులు జమ చేశారు. రూ. 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు కేసీఆర్. 12వ సీజన్ వేసేందుకు పైసలు జమ చేశాం. దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఉత్తరం రాసి ఆపారు అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది దాటిపోయినా రైతుబంధు రూపంలో రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదు. 12వ సీజన్ కింద రూ. 7500 కోట్లు మేమే వేసేటోళ్లం. మేం దాచిపెట్టిన రూ. 7500 కోట్లను వాళ్లు రైతుల ఖాతాల్లో వేశారు. కొత్తగా ఇవ్వకపోగా.. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట బిల్డప్ ఇచ్చారు. రైతులను రాజులను చేస్తాం అని రాహుల్ గాంధీ చేత ఉపన్యాసాలు ఇప్పించారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామన్నారు. ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ, బోనస్ రూ. 500, రైతు కూలీలకు రూ. 12 వేలు ఇస్తామన్నారు. ఇది రైతు డిక్లరేషన్ వాగ్దానాలు అని కేటీఆర్ గుర్తు చేశారు.

## భట్టి పర్యటనలో జగ్గారెడ్డి డుమ్మా

- గ్రూపు విభేదాలు రాజుకుంటున్నాయని సర్వత్రా చర్చలు



హైదరాబాద్,ప్రజాభూవి

సంగారెడ్డిలో జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఐఐటీ ఐదరాబాద్‌లో జరిగిన ఓ అధికారిక కార్యక్రమానికి భట్టి హాజరయ్యారు. అయితే సంగారెడ్డి జిల్లాలో ఏ అధికారిక కార్యక్రమం జరిగినా ముందుండే కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సదరు మీటింగ్‌కు డుమ్మా కొట్టడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. జగ్గారెడ్డి మీటింగ్‌కు హాజరు కాకపోవడంపై ఆ పార్టీ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతున్నది. హైదరాబాద్ ఐఐటీలో ఖనిజ ఉత్పత్తుల కోసం ఐఐటీ హైదరాబాద్‌తో సింగరేణి ఒప్పందం చేసుకున్న కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి హాజరయ్యారు. అయితే ఈ ప్రోగ్రామ్‌కు జగ్గారెడ్డి మాత్రం అటెండ్ కాలేదు. దీంతో ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఇదే హాట్ టాఫిక్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు ముమ్మరమయ్యాయని, సీఎం పదవి కోసం భట్టితో పాటు మరికొందరు సీనియర్ నాయకులు అంతర్గతంగా కొద్ది రోజుల నుంచి పావులు కదుపుతున్నారని కాంగ్రెస్ నేతలే బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన జగ్గారెడ్డి అందుకే సదరు కార్యక్రమానికి హాజరు కాలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. తనకు రెండో పవర్ సెంటర్‌గా ఎవరు ఉండొద్దనే కోణంలో సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే జగ్గారెడ్డిని అటెండ్ కాకుండా అడ్డుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మునుముందు రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయోనని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



మెదక్,ప్రజాభూమి

మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు, ఆటో ఢీ కొనడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన నర్సాపూర్ పట్టణ సమీపంలోని మెదలమ్మ గుడి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రజాభవన్‌లో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన




హైదరాబాద్,ప్రజాభూమి

ప్రజా భవన్‌లో 2008 డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నియామక పత్రాలు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ.. 2008 డీఎస్సీ అభ్యర్థుల కోసం జీవో నెంబర్ 9 తెచ్చి క్యాబినెట్ అప్రూవల్ చేసి కూడా సంవత్సరం గడిచింది.. అయినా తమకు ఉద్యోగాలు ఇవ్వలేదు అని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండోసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి కూడా 100 రోజులు కావొస్తుంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఒరిజినల్స్ తీసుకోని 4 నెలలు అవుతుంది.. ఒరిజినల్స్ సర్టిఫికెట్స్ లేనందున బయట ఉద్యోగాలు కూడా చేసుకోలేకపోతున్నామని, ఇంట్లో వాళ్లపై ఆధారపడలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

## కుంభమేళాకు ప్రత్యేక వెబ్‌పేజీ



న్యూఢిల్లీ,ప్రజాభూమి

జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. కుంభమేళా నేపథ్యంలో ప్రత్యేక వెబ్‌పేజీని రూపొందించినట్లు తెలిపింది.

## నటుడు అల్లు అర్జున్‌కు ఊరట

### - సంధ్యా థియేటర్ ఘటనలో రెగ్యులర్ బెయిల్ మంజూరు




హైదరాబాద్,ప్రజాభూమి

సినీనటుడు అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియగా.. నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. రూ.50వేలు, రెండు పూచీకత్తులను సమర్పించాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది.'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు ఆయన్ను జైలుకు తరలించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో అల్లు అర్జున్ విడుదలయ్యారు.మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో ఆయన వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అదే రోజు అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది.

# ఫసల్‌బీమాపై అవగాహన కల్పించాలి

### - పథకం పొడించిన నేపథ్యంలో రైతుల్లో చర్చ చేయాలి




న్యూఢిల్లీ,ప్రజాభూమి

2026 వరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పొడిగింపునకు కేంద్రం ఆమోదించింది. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని కొనసాగించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన నేపథ్యంలో ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలి. అలసు ఎంతమంది రైతులు ఇందులో చేరారో, దాని ప్రయోజనం సమకూరుతుందా లేదా అన్నది కూడా ఆలోచన చేయాలి. దేశంలో పంటల బీమా అన్నది ఓ వృధా ప్రయాసగా మారింది. అలా కాకుండా పక్కగా అమలు జరగాలి. రైతులకు పంటల బీమాపై అవగాహన ఉండాలి. మొత్తం 69,515.71 కోట్ల బడ్జెట్‌తో 2025–26 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. కొత్త సంవత్సరం మన దేశ ప్రజల జీవితాల్లో ఆనందం, శ్రేయస్సును తీసుకురావడంతోపాటు అభివృద్ధి చెందిన భారతదేశంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పాన్ని మనం నెరవేర్చగలుగుతామని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు బియ్యం ఎగుమతి విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. అభివృద్ధి చెందిన భారతదేశం సాధించడానికి 2024 సంవత్సరం ప్రాతిపదికగా మారిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచి వారిని స్వావలంబన చేసే దిశగా విశేష కృషి జరిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో 2024వ సంవత్సరం అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్య సాధనకు పునాదిగా మారిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి చౌహాన్ అన్నారు. గత పదేళ్లలో వ్యవసాయ రంగంలో అపూర్వమైన విజయాలు సాధించామన్నారు. వ్యవసాయం, రైతులకు సంబంధించిన అనేక ముఖ్యమైన బహుమతులను ప్రధాని ప్రతి మంత్రివర్గానికి అందించారన్నారు. రైతులకు సేవ చేయడమే మోదీ ప్రభుత్వానికి దేవుడి పూజతో సమానమన్నారు. 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన' విడుదలతో ప్రధానమంత్రి తన మూడవ దఫాను ప్రారంభించి 9.26 కోట్ల మంది రైతులకు నేరుగా రూ.20 వేల కోట్లు పంపారని తెలిపారు. అంతేకాకుండా, 109 వాతావరణ అనుకూల రకాల పంటలను రైతులకు అంకితం చేశారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024–25 కోసం 14 ఖరీఫ్ పంటలపై కనీస మద్దతు ధరను పెంచడానికి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. బియ్యంపై కనీస ఎగుమతి ధరను తొలగించామని, బాస్మతియేతర వైట్ రైస్ వ్యాపారంపై భారత్–ఇండోనేషియా మధ్య ఎంఓయూ కుదిరింది. భారతదేశం ఒక మిలియన్ మెట్రిక్ టన్నుల బాస్మతియేతర తెల్ల బియ్యాన్ని ఎగుమతి చేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రూ. 69,515.71 కోట్ల వ్యయంతో 2025–26 వరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని కొనసాగించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024లో 4 కోట్ల మందికి పైగా రైతులు లబ్ది పొందారు, ఈ పథకాన్ని 2026 వరకు పొడిగించినట్లు శివరాజ్ సింగ్ వెల్లడించారు. ఈ నిర్ణయం 2025–26 నాటికి దేశవ్యాప్తంగా రైతులకు ప్రకృతి వైపరీత్యాల నుండి పంటలను నష్టపరిచేందుకు సహాయపడుతుంది. ఇంకా, పథకం అమలులో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించడం వల్ల పారదర్శకతగా పరిష్కారం దొరుకుతుందన్నారు. అలాగే, రూ. 824.77 కోట్ల కార్పస్‌తో ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫండ్ (ఈఎం÷) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు మంత్రి తెలిపారు. ఈ ఫండ్ జఇ÷ూ–÷ఇఅఉ, చిఎఔఆ÷ూ వంటి సాంకేతిక కార్యక్రమాలకు అలాగే పథకం కింద పరిశోధన, వ్యవసాయాభివృద్ధి అధ్యయనాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఉపయోగించడం జరుగుతుందన్నారు. సాంకేతికత ఆధారిత దిగుబడి అంచనాలకు కనీసం 30 శాతం వెయిటేజీతో దిగుబడి అంచనా కోసం రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తుంది. ప్రస్తుతం తొమ్మిది ప్రధాన రాష్ట్రాలు దీనిని అమలు చేస్తున్నాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్, అస్సాం, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. ఇందులో ఇతర రాష్ట్రాలను కూడా వేగంగా చేర్చుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. జఇ÷ూ–÷ఇఅఉ విస్తృత అమలుతో, పంట కోత ప్రయోగాలు, సంబంధిత సమస్యలు క్రమంగా ముగుస్తాయని ఆయన అశాభావం వ్యక్తం చేశారు. ఇక ఈశాన్య రాష్ట్రాల రైతులందరినీ ప్రాధాన్యతా ప్రాతిపదికన సంతృప్తిపరిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, మరింత ముందుకు సాగుతామని కేంద్ర మంత్రి తెలిపారు. అయితే, ఈ పథకం స్వచ్ఛందంగా, ఈశాన్య రాష్ట్రాలలో స్థూల పంటల విస్తీర్ణం తక్కువగా ఉన్నందున, అవసరమయ్యే నిధులు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

## ఆత్మహత్యలే పరిష్కారం కాదు

### - ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్,ప్రజాభూమి

చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడవద్దని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇటీవల వరుసగా పోలీసుల ఆత్మహత్యల నేపథ్యం లో ఆయన స్పందించారు. అనవసర విషయాల్లో తలదూర్చి మనస్తాపాలకు లోను కావొవద్దన్నారు. ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే తమ కుటుంబాలతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎవరి ఎవరికి చెప్ప కుండా ఉంటే అవి ఆత్మహత్యలకు పురిగొల్పుతాయన్నారు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించి పోలీసు సిబ్బందికి తగిన కౌన్సెలింగ్, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. తెలంగాణలో గత 30 రోజుల్లోనే ఆరు మంది పోలీసులు తమ విలువైన ప్రాణాలను చేజేతులా నాశనం చేసుకున్నారని ఆర్ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న కూడా ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పరంపర ఇంతటితో ఆగాలి అని ఆయన అన్నారు.

## రాజకీయ స్వార్థం కోసమే జమిలి ఎన్నికలు

### - బీవీ రాఘవులు



సంగారెడ్డి,ప్రజాభూమి

రాజకీయ స్వార్థం కోసమే జమిలి ఎన్నికల కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శిం చారు. సంగారెడ్డి సీపీఎం పార్టీ కార్యాల యంలో ఆయన మీడియా సమా వేశంలో మాట్లాడారు. ఢిల్లీ ఎన్ని కల్లో ప్రయోజనం కోసమే ఒకే దేశం, ఒకే ఎన్నికని బీజేపీ కుట్ర లు పన్నుతున్నది. పార్లమెంట్‌లో జమిలి బిల్లు పాస్ కాదని విషయం తెలిసినా హైలెట్ కావడం కోసమే బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో మంత్రులు కస్తూర్బా ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌లో గత 39 రోజులుగా రైతులు ఉద్యమం చేస్తున్నారు. దలేవాల్ అనే రైతు నాయకుడు హాస్పిటల్‌లో నిరాహార దీక్ష చేస్తున్నారు . అయినా కేంద్ర ప్రభుత్వం రైతుల ఆందోళనలపై స్పందించకపోవడం దారుణమన్నారు. కస్తూర్బా గాంధీ ఉద్యోగులు గత 25 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వారి డిమాండ్‌లపై దృష్టి సారించాలి. ఉద్యోగులను చర్చలకి పిలిచి ప్రభుత్వం మాట్లాడాలని సూచించారు.

# పాతబస్తీలో మెట్రో పనులు షురూ

### - 7న బాధితులకు పరిహారం పంపిణీ



హైదరాబాద్,ప్రజాభూమి

పాతబస్తీలో మెట్రో నిర్మాణానికి అవసరమైన క్షేత్రస్థాయి పనులను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్), రెవెన్యూ అధికారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. ప్రధానంగా మెట్రో ఏర్పాటు కోసం ఆస్తులు కోల్పోతున్న బాధితులకు పరిహారం అందించే కార్యక్రమాన్ని చివరి దశకు తీసుకొచ్చారు. సమ్మతి లేఖలు ఇచ్చిన వారికి ఈ నెల 7న హైదరాబాద్ కలెక్టరేట్‌లో పరిహారం చెక్కులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో దశ విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పనులను రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తోంది. రూ.2,741 కోట్లతో ఈ కారిడార్‌ను పూర్తి చేసేందుకు సిద్ధమైంది. దారుల్‌షిఫా, ఆలిజాకోట్ల, హరిబౌలి, మీర్ మోమిన్‌దైరా, లాల్‌దర్వాజా మోడ్, ఆలియాబాద్ జెండా, ఫలక్‌నుమా మీదుగా చేపడుతున్న నిర్మాణంలో 1,100 ఆస్తులు కోల్పోతున్నట్లు హెచ్ఏఎంల్ అధికారులు గతంలోనే ప్రకటించారు. వీటికి సంబంధించి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దశలవారీగా నోటిఫికేషన్ జారీ చేశారు. ఆస్తులు కోల్పోతున్న వారికి గజానికి రూ.81 వేలు ఇస్తున్నట్లు ఇటీవల హెచ్ఏఎంఎల్, రెవెన్యూ అధికారులు ప్రకటించారు. దీనికి అంగీకరించే వారు రసూల్‌పురాలోని మెట్రో భవన్‌కు వచ్చి డాక్యుమెంటేషన్‌ను పూర్తి చేసుకోవాలని సూచించారు. దీంతో పాత బస్తీలోని ఆయా ప్రాంతాలకు చెందిన బాధితులు పది రోజులుగా మెట్రో భవన్‌కు తరలివెళ్తూ ఆ ప్రక్రియను పూర్తి చేసుకుంటున్నారు. ఇప్పటివరకు 189 ఆస్తులకు సంబంధించి యజమానులు సమ్మతి లేఖలు ఇచ్చినట్లు ఓ అధికారి తెలిపారు. మరో నాలుగు రోజుల్లో 300 మంది వచ్చే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎంపీ చేతుల మీదుగా బాధితులకు చెక్కులు పంపిణీ చేసిన మరుసటి రోజు నుంచే పాత బస్తీలో కూల్చివేతలు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హెచ్ ఏఎంఎల్ అధికారులు ఏర్పాట్లు చేసు కుంటున్నారు. తొలి విడతలో 50 మందికి కలెక్టరేట్‌లో చెక్కులు పంపిణీ చేసి, మిగతా వారికి మెట్రోభవన కు పిలిచి అందజేయనున్నారు. చెక్కులు తీసుకున్నవారి ఆస్తులను వరుసగా తొలగించనున్నారు.

# ట్రంప్ రాకకు ముందే అనేక డిమాండ్లు

## - ఓపిటిపై అప్పడే మొదలైన ఆందోళనలు

వాషింగ్టన్,ప్రజాభూమి



ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వకరించడానికి ముందే అనేక అంవాలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. ఇందులో వీసాలు మొదలు, ఓపిటి వరకు చర్చకు తెరతీసాయి. ఇదే సమయంలో అంతర్జాతీయ విద్యార్థులు పని అనుభవం సంపాదించేందుకు వాడే ది ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్‌కు ముగింపు పలకాలన్న ఒత్తిడి పెరుగుతోంది. అమెరికన్లకు లభించాల్సిన జాబ్స్‌ను ఈ ప్రోగ్రాం కింద వచ్చిన విదేశీ విద్యార్థులు ఎగరేసుకుపోతున్నారనే ఆందోళనలు తీవ్రమయ్యాయి. సంప్రదాయ మార్గాలను బైపాస్ చేసి.. దీర్ఘకాలిక వలసలకు కూడా దీనిని విద్యార్థులు వాడుకొంటున్నారనే విమర్శలొస్తున్నాయి. వాస్తవానికి ఓపీటీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వినియోగిస్తారు. దీనికింద ఎఫ్-1 వీసా ఉన్న విద్యార్థులు స్టెమ్ డిగ్రీ పూర్తి చేస్తే అమెరికాలో మూడేళ్లపాటు పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమానికి ఆ దేశ కాంగ్రెస్ అనుమతి లేదని విమర్శకులు తరచూ ప్రస్తావిస్తుంటారు. అంతేకాదు.. ఈ విద్యార్థులు అమెరికన్ స్టూడెంట్లతో కలిసి ఉద్యోగాల కోసం పోటీపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అమెరికా జాబ్ మార్కెట్‌కు దీన్ని దొడ్డిదారిగా అభివర్ణిస్తుంటారు. అమెరికా టెక్ వర్కర్స్ గ్రూప్ ఈ ప్రోగ్రామ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 'ఓపీటీకి అతిథి ఉద్యోగుల స్కీమ్. దీనికి విదేశీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ అనే ముసుగు వేశారు. విశ్వవిద్యాలయాలు చదువుకు బదులు వర్క్‌పర్మిట్లను విక్రయిస్తున్నాయి. ట్రంప్ అమెరికాను రక్షించేందుకు, ఇక్కడి విద్యార్థులకు ఎదురయ్యే అన్యాయమైన పోటీని తొలగించేందుకు.. ఈ ఓపీటీ ప్రోగ్రామ్‌ను ముగించాలని కోరింది. ఇప్పటికే వాషింగ్టన్ అలయన్స్ ఆఫ్ టెక్నాలజీ వర్కర్స్ ఓపీటీపై 2023లో కోర్టును ఆశ్రయించింది. ఇది అమెరికా ఉద్యోగులకు హాని చేస్తోందని ఆరోపించింది. కానీ, కింది కోర్టు మాత్రం ఈ ప్రోగ్రామ్‌ను సమర్థించింది. మరో వైపు కొందరు చట్టసభ సభ్యులు అసలు ఈ కార్యక్రమాన్నే రద్దు చేయించేందుకు సన్నద్ధమవు తున్నా రు. భారత విద్యార్థులు వృత్తిపరమైన అవకాశాలు.. హెచ్1బీ వీసాల కోసం ఈ ఓపీటీ ప్రోగ్రామ్‌పైనే ఆధారపడతారు. ఇప్పుడు ట్రంప్ వచ్చాక దీనిపై సమీక్షిస్తే నష్టపోయేది భారతీయ విద్యార్థులే.

# సీఎంఆర్ కాలేజీ ఘటనపై కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

## - అమ్మాయిల వీడియోలు తీశారని ఫిర్యాదులు

హైదరాబాద్, ప్రజాభూమి




మేడ్చల్ సీఎంఆర్ కాలేజీ ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గర్ల్స్ హాస్టల్‌లో అమ్మాయిల ప్రైవేట్ వీడియోలు ఆగంతకులు తీశారని ఫిర్యాదు వచ్చాయి. ఇప్పటికే హాస్టల్ వార్డెన్‌తో సహా ఏడుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తొమ్మిది మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. ఇప్పటికే హాస్టల్ వార్డెన్‌ను యాజమాన్యం సస్పెండ్ చేసింది. మరోవైపు పలు ఫింగర్ ప్రింట్‌లను కూడా పోలీసులు సేకరించారు. ఫింగర్ ప్రింట్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆడపిల్లల వీడియోలు బయటకి పోతాయేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఘటనపై మహిళా కమిషన్ దర్యాప్తు ప్రారంభించింది. ఫోరెన్సిక్ నుంచి వచ్చే రిపోర్ట్‌పైనే ఈ కేసు ఆధారపడి ఉంది. ఈ ఘటనతో మూడు రోజుల పాటు కాలేజ్ యాజమాన్యం సెలవులు ప్రకటించింది. దీంతో విద్యార్థినిలు అందరూ ఇళ్లకు వెళ్లిపోతున్నారు. కాగా.. మేడ్చల్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద పెద్ద ఎత్తున విద్యార్థినిలు ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. తాము స్నానం చేస్తుండగా వీడియోలు తీశారని.. బాత్ రూమ్‌లల్లో కెమెరాలు పెట్టారంటూ విద్యార్థినిలు ఆందోళన బాట పట్టారు. గత రెండు రోజులుగా విద్యార్థినిలు నిరసనకు దిగారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోవైపు విద్యార్థినిల ఆందోళనకు ఎన్ఎస్‌యూఐ నాయకులు మద్దతు తెలిపారు. స్టూడెంట్స్‌ను కలిసి ఏం జరిగిందో తెలుసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు కూడా సీఎంఆర్ కాలేజ్ ప్రాంగణానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మరోవైపు మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస రెడ్డి అక్కడకు చేరుకుని విద్యార్థినిలతో మాట్లాడారు. ఆందోళనను విరమించాలని కోరారు. అయితే తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనను విరమించేది లేదని విద్యార్థినులు స్పష్టం చేశారు. నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కాగా హాస్టల్ బాత్‌రూమ్‌లో సీసీ కెమెరాల ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

# 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

- సంపద సృష్టించడం.. ప్రజలకు పంచడమే ధ్యేయం
- దత్తపీఠం దర్శించుకున్న సిఎం చంద్రబాబు నాయుడు

విజయవాడ,ప్రజాభూమి



2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం అని సిఎం చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్రంలో విజన్-2020 ప్రకటిస్తే చాలా మంది తప్పుబట్టారు. కానీ ఆ విజన్ ఫలితాలు ఇవాళ అందరికీ కనిపిస్తున్నాయి. ఇప్పుడు విజన్-2047 గురించి ఆలోచిస్తున్నాం. సంపద రావాలి.. ప్రజలు సంతోషంగా ఉండాలి. ఈ విషయంలో ముందుకు వెళ్లడమే తప్ప వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. విజయవాడ పటమటలోని దత్త పీఠాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామితో చంద్రబాబు సమావేశమయ్యారు. సీఎంకు స్వాగతం పలికిన గణపతి సచ్చిదానంద స్వామి.. తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రాష్ట్రంలోని 42 ప్రాంతాల్లో చేపట్టబోయే దత్త క్షేత్రనాథ్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'స్వామీజీని దర్శించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నా. సమాజహితం కోసమే సచ్చిదానంద పనిచేస్తున్నారు. నా కష్టాలు తొలగాలని పూజలు చేసి నాకు ప్రసాదం అందించారు. ఆధ్యాత్మిక భావన మనలో ఉండాలి. ఎప్పుడూ యథార్థాన్ని చెప్పే పరిస్థితిలో మనం ఉండాలి. భగవంతుడి ఆశీస్సులు కూడా తోడుగా ఉండాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలి. పేదరికం పూర్తిగా పోవాలి. ప్రజలు సంతోషంగా ఉండాలని నేను కోరుకుంటున్నా. ఆ దిశగా కృషి చేస్తాం. ప్రజలు నాపై నమ్మకం పెట్టుకోవాలి.. రాష్టాన్ని స్వర్ణాంధ్ర వైపు తీసుకెళ్లే బాధ్యత నేను తీసుకుంటాను' అని చంద్రబాబు అన్నారు. గణపతి సచ్చిదానందస్వామి మాట్లాడుతూ.. 'కృష్ణానది ఒడ్డున జరిగిన సభను మర్చిపోలేను. చంద్రబాబు కర్మ యోగి.. ఆయన సంకల్పించిన పనులు నిర్విఘ్నంగా జరుగుతాయి. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండటమే కాకుండా స్వర్ణాంధ్ర సాకారం కావడం తథ్యం. ఆయనకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు.

# హోం సెక్రటరీ రవిగుప్తాతో దిల్ రాజ్ భేటీ

హైదరాబాద్,పజాభూమి



టాలీవుడ్ అగ్ర నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు శుక్రవారం తెలంగా ణ హోంశాఖ స్పెషల్ సెక్రటరీ రవి గుప్తాను కలిశారు. ఈ సమా వేశంలో ఇండస్ట్రీ డెవలప్మెంట్ కోసం తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ప్రోగ్రామ్స్ గురించి మాట్లాడినట్లు తెలిసింది. అలాగే థియేటర్ల లైసెన్స్‌ల పునరుద్ధరణ పక్రియ సులువుగా అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. మరోవైపు సంధ్య థియేటర్ తొక్కిసలాట వివాదం కారణంగా తెలంగాణ ప్రభుత్వం బెనిఫిట్ షోలను రద్దు చేసిన విష యం తెలిసిందే. అయితే సంక్రాంతికి మూడు పెద్ద సినిమాలు 'గేమ్ ఛేంజర్','డాకు మహా రాజ్', 'సంక్రాం తికి వస్తున్నాం' సినిమాలు రిలీజ్ కానున్నాయి. ఇందు లో రెండు సినిమాలకి దిల్‌రాజు నిర్మాతగా వ్యవ హరి స్తున్నారు. ఈ నేపథ్యంలోనే టికెట్ రేట్ల పెంపు, బెనిఫి ట్ షోల అనుమతి, భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగి నట్లు సమాచారం. దిల్‌రాజుతో పాటు తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ అధ్య క్షుడు సునీల్ నారంగ్, పలువురు ఎగ్జిబిటర్లు హాజరయ్యారు.

### ఫార్ములా ఈ కార్ రేసు కేసులో

# అధికారులకు మళ్లీ పిలుపు

## - 8,9 తేదీల్లో రావాలని ఆదేశం



హైదరాబాద్,ప్రజాభూమి

ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ విచారణ నిమిత్తం అధికారులకు మళ్లీ పిలుపునిచ్చింది. ఈనెల 8, 9 వ తేదీల్లో బీఎల్ఎన్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌లకు రావాల్సిం దిగా పిలిచింది. అయితే తమకు కొంత సమయం కావాలని, రెండు, మూడు వారాలపాటు సమ యం కావాలని అధికారులు కోరారు. దీంతో ఈనెల 8, 9 తేదీల్లో తప్పకుండా హాజరుకావాలని ఈడీ నోటీసులు పంపింది. కాగా ఫార్ములా ఈ కారు రేసు కేసులో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి గురువారం ఈడీ విచారణకు హాజరు కాలేదు. తనకు కొంత సమ యం కావాలని ఆయన ఈ మెయిల్ ద్వారా ఈడీ అధికారులను కోరారు. దీనికి వారు సాన కూలంగా స్పం దించి.. మరోసారి పిలుస్తామని జవాబు ఇచ్చారు. శుక్రవారం విచారణకు హాజ రు కావాల్సిన సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ కూడా తాను రాలేనని, మరో తేదీ ఇవ్వాలని కోరారు. దీంతో ఆయనను కూడా మరో రోజు విచారణకు పిలుస్తామని అధికారులు తెలిపారు. ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో ఏసీబీ కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వ్‌లో ఉంది. ఆ తీర్పు వచ్చిన తర్వాత విచారణకు హాజరయ్యే విషయంపై నిర్ణయం తీసుకోవాలని బీఎల్ఎన్ రెడ్డి, అరవింద్ కుమార్ భావిస్తున్నట్లు తెలు స్తోంది. కేటీఆర్‌ను ఈ నెల 7న హాజరు కావాలని ఈడీ ఇప్పటికే సమన్లు జారీ చేసింది. హై కోర్టు తీర్పు తర్వాతే... కేటీఆర్ విచారణకు హాజరవుతారా లేదా అనే విషయం తేలే అవకాశం ఉంది.

# ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు శుకవ్రారం ప్రమాణ స్వీకారం




న్యూఢిల్లీ,ప్రజాభూమి

ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణం చేయించారు. రాజధాని భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్, మాజీ సీఎం నవీన్ పట్నాయక్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీజేపీ నేతలు తదితరు లు పాల్గొన్నారు.కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కంభం పాటి హరిబాబు 2021 జులైలో తొలిసారి మిజోరం గవర్నర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్ రాజీనామాతో.. ఆయన స్థానంలో కంభంపాటి హరిబాబు ను నియమిస్తూ గతేడాది డిసెంబర్‌లో కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా కేంద్ర హెూంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమా ర్ భల్లా శుక్రవారం మణిపూర్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. దేశంలోని ఐదు రాష్ట్రాలకు కేంద్రం గవర్నర్లను నియమించిన విషయం తెలిసిందే. బీహార్ గవర్నర్ గా ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, కేరళ గవర్నర్‌గా రాజేంద్ర విశ్వ నాథ్ అర్లేకర్, ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు, మిజో రం గవర్నర్‌గా జనరల్ విజయ్ కుమార్ సింగ్, మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హెూంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను నియమించింది. ఈ మేరకు గత నెల 24న రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే.

# మెడికల్ సీట్లు ఖాళీగా ఉండడానికి వీల్లేదు

## - రాష్టాల్రకు సుప్రీం కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ,ప్రజాభూమి

వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లు ఖాళీగా ఉండటానికి వీల్లేదని ,మెడికల్ సీట్లకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలతో సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. వైద్య విద్యకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో దాదాపు వెయ్యికి పైగా సీట్లు ఖాళీగా ఉండటంపై ఏప్రిల్ 2023లో సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓ వైపు సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వైద్యుల కొరత ఉండటం, మరోవైపు ఇలా సీట్లు మిగిలిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన అన్ని రాష్టాల్రు, ప్రైవేటు మెడికల్ కాలేజీల ప్రతినిధులతో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తాజాగా కొన్ని సిఫార్సులు చేయడంతో ఇదే విషయాన్ని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ అంశానికి సంబంధించిన పిటిషన్‌ను నేడు విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. మెడికల్ సీట్లు ఖాళీగా ఉండకూడదని స్పష్టం చేసింది. వివిధ భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేసి, ఆ తర్వాత ఓ కచ్చితమైన ప్రతిపాదనతో వస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించిన న్యాయస్థానం.. మూడు నెలల్లో పూర్తి చేయాలని పేర్కొంటూ తదుపరి విచారణ ఏప్రిల్‌లో చేపడతామని తెలిపింది.

## తిరుమలలో వైకుంఠ
# ఏకాదశి సందడి

- వైకుంఠ ద్వారదర్శనం కోసం ఏర్పాట్లు



తిరుమల,ప్రజాభూమి

తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని పలు ప్రాంతాలను అదనపు ఇఒ, జెఇఒ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పి సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో అదనపు ఇఒ మాట్లాడుతూ.. వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టిటిడి అధికారులు, విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలలో అధిక సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దర్శనానికి విచ్చేసే విఐపిలకు వారికి అందించే పాసులలోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వివరాలు పొందిపరిచనున్నట్లు తెలిపారు. విఐపిలు, యాత్రికులు తమకు కేటాయించిన సమయం ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యాత్రికులు తమ పాదరక్షలను గదులలో, వారి వాహనాలలో వదలి రావాలన్నారు. అధిక రద్దీ నేపథ్యంలో తోటి యాత్రికులకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్యాని పాటించాలని, వ్యర్థాలను టిటిడి
ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలని కోరారు.

## గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు
# సుప్రీంకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ, ప్రజాభూమి

డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. 2002లో జరిగిన డేరా మాజీ మేనేజర్ రంజిత్ సింగ్ మర్డర్ కేసులో గుర్మీత్‌తో పాటు మరో నలుగురికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ఆ కేసు నుంచి గుర్మీత్ పేరును తొలగించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సీబీఐ సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నదని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం తెలిపింది. బేలా త్రివేది బెంచ్ ముందుకు ఈ కేసును పంపనున్నట్లు చెప్పారు. హర్యానాలోని కురక్షేత్రలో ఉన్న ఖాన్పుర్ కాలనీలో 2002, జూలై 10వ తేదీన రంజిత్ సింగ్ హత్యకు గురయ్యాడు. అనేక మంది మహిళలపై గుర్మీత్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రాసి ఉన్న ఓ లేఖను రంజిత్ సింగ్ సర్క్యులేట్ చేసినట్లు అనుమానాలు ఉన్నాయి. ఆ మర్డర్ కేసులో పంచకుల సీబీఐ కోర్టు 2021లో రామ్ రహీమ్‌తో పాటు మరో నలుగుర్ని దోషులుగా ప్రకటించింది. అయిదుగురికి జీవితఖైదు శిక్ష వేసింది. గుర్మీత్‌కు 31 లక్షల జరిమానా కూడా విధించారు.

# జెన్‌కో కార్యాలయం వద్ద అభ్యర్థుల ధర్నా





హైదరాబాద్, ప్రజాభూమి

టీజీ జెన్‌కోలో కొలువుల భర్తీకి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో జెన్‌కో రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులంతా.. నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిన్న జెన్‌కో కార్యాలయం వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జెన్‌కో అభ్యర్థుల ఆందోళనలపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. టీజీ జెన్‌కోలో ఏం జరుగుతుంది..? అపాయింట్‌మెంట్ లెటర్స్ ఎందుకివ్వడం లేదు? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూటిగా ప్రశ్నించారు. జెన్‌కోలో ఏఈ, కెమిస్ట్ పరీక్ష రాసి, ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు ఎంతకాలం ఎదురుచూపులు చూడాలని ఆర్ఎస్పీ నిలదీశారు. టీచర్లు, స్టాఫ్ నర్సులు, డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, గ్రూప్ 4 అభ్యర్థులందరికీ నియామక పత్రాలు ఇచ్చి, వీరికి మాత్రమే ఎందుకు ఇవ్వడం లేదు? అని అడిగారు. సీఎండీ, ఇతర అధికారులేమో ప్రభుత్వం ఇవ్వాలి.. మా చేతిలో ఏం లేదంటరు.. సంబంధిత మంత్రి గారేమో నాలుగు సార్లు కలిసినా పట్టించుకోరు. పరీక్ష నిర్వహిస్తారు.. ఫలితాలు విడుదల చేస్తారు.. వెరిఫికేషన్ చేస్తారు.. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుంటరు.. ఆఖరికి బాండ్ పేపర్ కూడా రాయించుకోని రోడ్ల మీద వదిలేస్తరా..? వాళ్లు ఏం పాపం చేసింద్రు..? వీళ్లు తెలంగాణ ప్రాంతీయులు కాదా..? లేదంటే వీళ్లు కూడా నాలుగువేల మంది సర్వ శిక్ష అభియాన్ టీచర్ల మాదిరిగా, రోడ్ల మీద టెంట్లు వేసుకొని ధర్నాలు చేయాలా? ఆలస్యం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి? ఇదేనా ప్రజా ప్రభుత్వం అంటే ఇట్లనే ఉంటే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పారదోలడం ఖాయం అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

# రాబోయే ఐదేళ్లలో కాలుష్య రహిత నగరంగా ఢిల్లీ

## - నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ,ప్రజాభూమి



రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశ రాజధాని రవాణా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. గత నవంబర్ నుంచి ఢిల్లీలో కాలుష్య స్థాయి ఎక్కువగానే ఉన్నది. కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు. ఇటీవల గాలి నాణ్యత సూచీ 350 వరకు చేరింది. కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 కింద ఆంక్షలు మళ్లీ తీసుసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కార్లపై మరోసారి నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే, ఢిల్లీలోని వాతావరణ కాలుష్యానికి కారణాల్లో వాహనాలు ఉద్గారాలు సైతం ఒకటి. ఢిల్లీ రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడిని కేంద్రమంత్రి తెలిపారు. అదనంగా రూ.12500 కోట్ల సీఆర్ఐఎఫ్ ఫండ్‌ని సైతం ప్రకటించారు. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి రహదారుల మంత్రిత్వ శాఖ ఏయే ప్రాజెక్టులను ప్రారంభించబోతుందో ఆయన వివరించారు. వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో ఢిల్లీ ఇబ్బందులపడుతుందని.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీని ఆయా సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించిందన్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు కొత్త రోడ్డు ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయన్నారు. కాలుష్యాన్ని క్లీన్ ఎనర్జీ ద్వారా తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ కాలుష్యంలో 40శాతం శిలాజ ఇంధనాల వినియోగమే కారణమని.. దాంతో ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, స్కూటర్లు, సీఎన్‌జీ వాహనాలను తీసుకువచ్చామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కొత్త రోడ్ నెట్‌వర్క్‌తో వాహనాల రద్దీ తగ్గుతుందన్నారు. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ చుట్టూ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఇప్పటికే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించిందని.. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ప్రాజెక్ట్ కింద.. ఢిల్లీ-కత్రా ఎక్స్‌ప్రెస్ వేతో కుండ్లి మనేసర్ పాల్వాల్ ఎక్స్‌ప్రెస్ వే.. లేదంటే వెస్ట్రన్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా కనెక్టివిటీని అందించే ఫేజ్-2ని మంత్రిత్వ శాఖ ఖరారు చేస్తోంది. ఆయా రోడ్‌నెట్ వర్క్‌ల ద్వారా జమ్మూ కశ్మీర్, పంజాబ్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా విమానాశ్రయం, ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేకు చేరుకునేలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కొత్త రోడ్ నెట్‌వర్క్ ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేకి నేరుగా కనెక్టివిటీని అందిస్తుందని.. దాంతో రాజధానిలో రద్దీని తగ్గించడంలో సహాపడుతుంది. మహిపాల్‌పూర్, రంగ్‌పురి ప్రాంతాల్లో రోజువారీ ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు ఐదు కిలోమీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మించే యోచనలో ఉన్నట్లు గడ్కరీ వివరించారు. రూ.3,500 కోట్లతో ఈ సొరంగాన్ని నిర్మించనున్నారు. ఈ సొరంగం వసంత్ కుంజ్‌లోని శివమూర్తి, నెల్సన్ మండేలా మార్గ్‌లను కలుపుతుంది.

# పేదలను మభ్యపెట్టి అవయవాల తస్కరణ

- అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవు
- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ హెచ్చరిక



గుంటూరు,ప్రజాభూమి

పేదలను మభ్యపెట్టి అవయవాలు తీసుకునే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. అవయవ దానంపై మెడికల్ కళాశాల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 5 బ్రెయిన్ డెడ్ కేసులు వస్తున్నాయని చెప్పారు. అవయవ దానం



చేయడానికి ప్రజలు ముందుకు రావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌ను ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. ఈ సమయంలో మంత్రికు నిరసన సెగ తాకింది. మెడికల్ పీజీ కౌన్సెలింగ్‌లో అక్రమాలపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్‌లో లోపాలు మంత్రికి చెప్పుకునేందుకు తల్లిదండ్రులు వచ్చారు. సమస్య చెబుతున్న వినకుండా మంత్రి సత్య కుమార్ ముందుకు వెళ్లిపోయారు. మంత్రి సత్యకుమార్ తీరుపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. వైద్యశాఖ నిర్లక్ష్యంతో మెడికల్ విద్యార్థులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. అయితే మెడికల్ పీజీ కాలేజ్ కౌన్సెలింగ్ వివాదంపై మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించారు. జగన్ ప్రభుత్వం నిర్వాకం వల్లే మెడికల్ పీజీ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోర్టు తీర్పుల వల్లే పీజీ విద్యార్థులు ఇబ్బందులు ఏదుర్కొంటున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వేసిన కమిషన్ అనేక విషయాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు, శాస్త్రీయ అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి మేలు జరుగుతుందో చూస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. వైద్య శాఖలో ఖాళీలను భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## నూతన 'ఉత్సాహంతో
# ఉత్తమ సేవలందించండి

- 2025 క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ,ప్రజాభూమి

నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పనిచేసి జిల్లానుఅభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. పీ ఎన్‌జీజీవో ఎన్‌టీఆర్ జిల్లాశాఖ 2025 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన సేవలందించ డంలో ఉద్యోగులది కీలకపాత్ర అన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అభివృద్ధిలో జిల్లాను నెం.1 స్థానంలో నిలిపేందుకు ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర అ 2047 దార్శనిక ప్రణాళికను విడుదల చేసిన నేపథ్యంలో ప్రణాళికలోని లక్ష్యాల సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడంలో, వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయడంలోనూ జిల్లా ఉద్యోగులు ముందుంటారన్నారు. ప్రగతి విషయంలో జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచారణతో కృషిచేస్తున్నారని.. ఆయన సారథ్యంలో ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయడం జరుగుతోందన్నారు. ఉూర్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు పి.రమేష్, కోశాధికారి బి.సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు వి.నాగార్జున, ఎం.రాజుబాబు, జి.రామకృష్ణ, ఆర్.శ్రీనివాస్, ఎం.గోపాలకృష్ణ, బీవీ రమణ, కె.శివలీల, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్, డీఎస్ఎన్ శ్రీనివాస్, పి.రాజశేఖర్, సీహెచ్ మధుసూధనరావు, ఎస్‌కే ఖాసిం సాహెబ్, వీవీ ప్రసాద్, టి.విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నిముషప్రియ
# విడుదలకు కృషి

- విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్



న్యూఢిల్లీ,,ప్రజాభూమి

యెమెన్‌లో ఓ హత్యా నేరంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారతీయ నర్స్ నిమిషప్రియకు మరణశిక్ష ఖరారైంది. ఆమెను విడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై తాజాగా విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్‌జైస్వాల్ స్పందించారు. 'నిమిష ప్రియ కేసులో మేం పరిణామాల న్నింటినీ సునిశితంగా పరిశీలిస్తున్నాం. ఈ కేసులో ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోం దని తెలిపారు. కాగా.. నిమిషను విడిపించాలని ఆమె కుటుంబం కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. యెమెన్ దేశ అధ్యక్షుడి నిర్ణయంతో ఆమెకు నెల రోజుల లోపులో మరణ శిక్ష అమలయ్యే అవకాశాలు ఉన్నాయని ఇదివరకే పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలావుంటే మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు ను పదవి నుంచి దింపేందుకు అక్కడి ప్రతిపక్షాలు కుట్ర చేశాయని అందులో భారత్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ యూఎస్ మీడియా ప్రచురించిన కథనాన్ని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అందులో ఎలాంటి విశ్వసనీయత లేదని పేర్కొంది. ముయిజ్జును అభిశంసించేందుకు ఆయన సొంత పార్టీలోని 40 మంది ఎంపీలకు కూడా లంచం ఇవ్వాలని అక్కడి ప్రతిపక్ష పార్టీ మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ యత్నించిందని, అందుకోసం భారత్ నుంచి 6 మిలియన్ల డాలర్ల సాయం కోరిందని ఆ కథనం సారాంశం.

# రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ ముగిసినట్లే!!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తన చివరి టెస్ట్ ఆడకుండానే రిటైర్మెంట్ చేయనున్నాడా? అందుకు ఔననే సమాధానం వస్తోంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో చివరి టెస్ట్ అంటే 5వ టెస్ట్ ప్లేయింగ్ 11లో రోహిత్ శర్మ పేరు కనిపించలేదు. ఇప్పటికే పేలవ ఫాం ఓ పక్క, కెప్టెన్సీ వైఫలం మరో పక్కా.. ఇలా ఎన్నో విమర్శల మధ్య మరో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 3 జనవరి 2025 రోజు భారత క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఏదైనా గాయం లేదా మరేదైనా కారణాల వల్ల జట్టు కెప్టెన్ ప్లేయింగ్-11కి దూరంగా ఉండాల్సి రావడం గమనార్హం. సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చివరి టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను చేర్చలేదు. ఆ తర్వాత ఇప్పుడు రోహిత్ టెస్ట్ కెరీర్‌పై ప్రశ్నార్థకమైంది. సిడ్నీలోని ఎస్సీజీలో జరుగుతున్న చివరి టెస్టు నుంచి రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత, రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ ముగిసినట్లేనని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు అతను ఎర్రటి బంతితో టీమ్ ఇండియా కోసం ఆడటం ఎప్పటికీ కనిపించదా అనే ప్రశ్న తలెత్తుతుంది. అవును.. ఇప్పుడు రోహిత్ శర్మ టెస్టు కెరీర్ ప్రమాదంలో పడింది. భారత క్రికెట్ జట్టు అత్యుత్తమ కెప్టెన్‌లలో ఒకరైన రోహిత్ శర్మను సిరీస్ మధ్యలో జట్టు



ప్లేయింగ్-11 నుంచి తొలగించారు. అతని ప్రస్తుత ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే, మెల్‌బోర్న్‌లో జరిగిన నాల్గవ టెస్ట్ మ్యాచ్ తనకు చివరిదని చెబుతున్నారు. అతని టెస్ట్ కెరీర్‌కు వీడ్కోలు మ్యాచ్ ఆడకుండానే వీడ్కోలు పలికాడని చెబుతున్నారు. ఇప్పుడు అతనికి వైట్ జెర్సీ ఫార్మాట్‌లో అవకాశం లభించే అవకాశం లేదు. ఎందుకంటే, గత కొంత కాలంగా టెస్టుల్లో హిట్ మ్యాన్ ఆడుతున్న తీరు అతడి టెస్టు కెరీర్ కు ఫుల్ స్టాప్ పడబోతోందని సూచిస్తోంది. సిరీస్‌లో ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడు చాలా పేలవంగా ఆడాడు. 3 టెస్ట్ మ్యాచ్‌లలో 5 ఇన్నింగ్స్‌లలో అతని బ్యాట్ నుంచి 31 పరుగులు మాత్రమే వచ్చాయి. ఇది మాత్రమే కాదు, అంతకుముందు న్యూజిలాండ్ వర్సెస్ బంగ్లాదేశ్ సిరీస్‌లు కూడా చాలా ఘోరంగా ఉన్నాయి. సిడ్నీలో జరగనున్న చివరి టెస్టు మ్యాచ్ తర్వాత రోహిత్ శర్మ తన టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకోవచ్చని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఇప్పుడు సిడ్నీ టెస్టులో కూడా ఆడలేని పరిస్థితి ఏర్పడింది. టెస్టు ఫార్మాట్‌లో రోహిత్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ నమ్మకం కోల్పోయిందని, ఇక్కడి నుంచి రోహిత్ కూడా త్వరలో రిటైర్మెంట్ తీసుకోవచ్చని తెలుస్తోంది.

# ఈ టెస్టు ఓడితే గంభీర్ స్థానం కూడా ప్రమాదంలో పడినట్లే

## - కోచ్ పదవి నుంచి గౌతమ్ గభీర్‌ను తొలగించే అవకాశం

బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టు సిడ్నీ వేదికగా జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా భారీస్కోరు చేస్తుందనిపించింది. కానీ అలాంటిదేమీ జరగలేదు. 185 పరుగులకే భారత జట్టు చాప చుట్టేసింది. రిషబ్ పంత్ అత్యధికంగా 40 పరుగులు చేశాడు. ఇతర బ్యాటర్లలో ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ స్కోరు చేయలేకపోయారు. నితీష్ కుమార్ రెడ్డి ఖాతా కూడా తెరవలేకపోయారు. బోలాండ్ 4, స్టార్క్ 3, కమిన్స్ 2, లియాన్ 1 వికెట్లు తీసుకున్నారు. దీంతో తొలి రోజు నుంచి ఆస్ట్రేలియా మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఈ టెస్టు మ్యాచ్‌లోనూ టీమిండియా ఓడిపోతే గౌతమ్ గంభీర్ స్థానం కూడా ప్రమాదంలో పడినట్లే. మీడియా కథనాల ప్రకారం, ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ప్రధాన కోచ్ పదవి నుంచి గౌతమ్ గభీర్‌ను తొలగించే అవకాశం ఉంది. అతని స్థానంలో వీవీఎస్ లక్ష్మణ్ వచ్చే అవకాశం ఉంది. గౌతమ్ గంభీర్ టీమ్ ఇండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి టీమ్ లో ఏదో తప్పు జరిగినట్లు కనిపిస్తోంది. గౌతీ కోచింగ్‌లో టీమ్ ఇండియా ఆట తీరు బాగా దిగజారిపోయింది. మొదట శ్రీలంకలో వన్డే సిరీస్, తర్వాత న్యూజిలాండ్‌తో 3-0తో టెస్టు, ఇప్పుడు బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్ కూడా కోల్పోవాల్సి వచ్చింది. నివేదికల ప్రకారం, గంభీర్, కెప్టెన్ రోహిత్ మధ్య సత్సంబంధాలు లేవనే టాక్ కూడా ఉంది. వీరి ఆలోచనా విధానం వల్లనే టీమ్ ఇండియా వరుసగా ఓడిపోతోందని అంటున్నారు. గౌతమ్ గంభీర్ శిక్షణ టీమిండియా ఆటగాళ్లకు నచ్చట్లేదని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో దీని ప్రభావం కనిపిస్తోంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియ న్‌షిప్ ఫైనల్‌కు టీమ్ ఇండియా చేరుతుందా లేదా అనేది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. ఒకవేళ సిడ్నీ టెస్టులో ఓడిపోతే, టీమిండియా జూన్ నెలలో ఇంగ్లండ్ లో నేరుగా టెస్ట్ సిరీస్ ఆడుతుంది. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం టీమిండియా ఇంగ్లండ్‌లో పర్యటించ నుంది. ఇలాంటి పరిస్థితుల్లో వీవీఎస్ లక్ష్మణ్‌కు టెస్టు జట్టు కోచ్ బాధ్యతలు అప్పగిం చనున్నట్లు సమాచారం. వీవీఎస్ లక్ష్మణ్ ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ అధిపతి గా ఉన్నారు. ఇప్పటికే అతను టీ20ల్లో టీమ్ ఇండియాకు ప్రధాన కోచ్‌గా పనిచేసిన అనుభవం ఉంది. అయితే ఇప్పుడు అన్ని ఫార్మాట్లలోనూ ఈ హైదరాబాదీ క్రికెటర్ నే ప్రధాన కోచ్ గా చేయాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు సమాచారం.



# బుమ్రాతో కోన్ స్టాస్ వాగ్వివాదం ..!




బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ జరు గుతున్న చివరి టెస్ట్ లో భారత్ 185 పరుగులకే అలౌట్ అయింది. భారత ఆటగాళ్లో రిషబ్ పంత్ 40 పరుగులు చేయగా.. రవీంద్ర జడేజా 26, గిల్ 20 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో బోలాండ్ 4 వికెట్లు తీయ గా.. స్టార్క్ 3, కమ్మిన్స్ 2, లయన్ ఒక వికెట్ పడగొట్టాడు. మొదటి ఇన్నిం గ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను ఆదిలోనే దెబ్బ కొట్టాడు. ఈ క్రమంలోనే ఆసీస్ ఓపెనర్ సామ్ కోన్ స్టాస్ భారత కెప్టె న్ జస్ప్రీత్ బుమ్రాతో వాగ్వాదానికి దిగాడు. కోన్ స్టాస్ భారత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా వాగుతూనే ఉన్నాడు. ఇరిటేషన్ తెప్పించే ప్రయత్నం చేశాడు. ఆసీస్ బ్యాటింగ్ మొదలు పెట్టినప్పుడు అతను దూకుడుగా ఆడాడు. జస్ప్రీత్ బుమ్రా వేసిన మొదటి బంతినే కోన్ స్టాస్ బౌండరీ తరలించాడు. ఈ క్రమంలోనే బుమ్రా మూడో ఓవర్ బౌలింగ్ వేశాడు. నాలుగు బాల్స్ పూర్తి అయ్యాయి. ఐదో బంతి వేసేందుకు సిద్ధం కాగా. . స్ట్రైకింగ్ చేస్తున్న ఖవాజా పక్కకు జరిగాడు. దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. వెనక్కు వెళ్లి బౌలింగ్ చేసే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాన్ ఏదో అన్నాడు. దీంతో బుమ్రా వెనక్కు దిరిగి అతని వద్దకు వెళ్లే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాస్ కూడా మాట్లాడడంతో మాటమాట పెరిగింది. ఈ క్రమంలోనే ఎంపైర్ జోక్యం చేసుకున్నాడు. దీంతో గొడవ సర్దుకుంది. ఆ తర్వాత ఓవర్ చివరి బంతికి బుమ్రా ఖవాజాను ఔట్ చేశాడు. అతను స్లిప్ లో క్యాచ్ ఇచ్చాడు. కేఎల్ రాహుల్ క్యాచ్ పట్టాడు. దీంతో భారత ఆటగాళు ,,, స్పెషల్లీ బుమ్రా కోన్ స్టాస్ వైపు చూస్తూ సంబరాలు చేసుకున్నారు. కాగా సమయాన్ని వృథా చేయాలనే వ్యూహంలో భాగంగానే జస్‌ప్రీత్ బుమ్రాతో ఆస్ట్రేలియా ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ గొడవకు దిగాడని టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ అన్నాడు. ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఆఖరి టెస్ట్ తొలి రోజు ఆట చివర్లో బుమ్రా-కొనస్టాస్ గొడవపడ్డారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఐదో బంతి వేసేందుకు బుమ్రా సిద్ధమవ్వగా.. స్ట్రైకింగ్‌లో ఉన్న ఉస్మాన్ ఖవాజా పక్కకు జరిగాడు. దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. కాస్త ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందుకు నాన్ స్ట్రైకర్‌గా ఉన్న కొన్‌స్టాస్ బదులివ్వడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరూ ఒకరిపై ఒకరు దూసుకెళ్లేం దుకు సిద్ధమవ్వగా అంపైర్లు జోక్యం చేసుకొని వారించారు. ఈ ఓవర్ చివరి బంతికే ఉస్మాన్ ఖవాజా ఔటవ్వగా.. భారత ఆటగాళ్లు కొన్‌స్టాస్ లక్ష్యంగా సంబరాలు చేసు కున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న రిషభ్ పంత్‌కు బుమ్రా-కొన్‌స్టాస్ గొడవకు సంబంధించిన ప్రశ్నలు ఎదురయ్యాయి. సమయాన్ని వృథా చేయాలనే ఉద్దేశంతోనే ఆసీస్ ఓపెనర్లు అలా వ్యవహరించారని పంత్ బదులిచ్చాడు. 'నాకు తెలిసి సమ యాన్ని వృథా చేయాలని ఆసీస్ ఓపెనర్లు భావించారు. జస్‌ప్రీత్ బుమ్రాతో సామ్ కొన్‌స్టాస్ గొడవపడటానికి కారణం కూడా ఇదేనని నేను భావిస్తున్నా. అతను ఏదో అన్నాడు. ఏం అన్నాడో నాకు వినిపించలేదు. కానీ ఆ సమయంలో నాకు అనిపించింది ఏందంటే.. మేం మరో ఓవర్ వేయకుండా సమయాన్ని వృథా చేయాలని భావించారని అర్థమైంది.'అని రిషభ్ పంత్ పేర్కొన్నాడు.

# సుందర్ వికెట్‌పై వివాదం..

## థర్డ్ అంపైర్ నిర్ణయంపై ఫైర్ అవుతున్న మాజీలు






బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్-ఆస్ట్రేలియా మధ్య సిడ్నీలో ఐదో టెస్టు మ్యాచ్ జరుగుతోంది. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ సిరీస్‌లో చివరి టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బౌలర్లు అద్భుతంగా రాణించి తొలిరోజే టీమిండియాను వెన్నుపోటు పొడిచారు. అయితే, ఈ సమయంలో భారత జట్టు ఆల్‌రౌండర్ ఆటగాడు వాషింగ్టన్ సుందర్ వికెట్‌పై వివాదం నెలకొంది. భారత క్రికెట్ జట్టు కీలక బ్యాట్స్ మెన్ మరోసారి విఫలమై పెద్దగా రాణించలేకపోయారు. దీని తర్వాత, ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ కొంతకాలం పిచ్‌పై నిలవడంలో విజయం సాధించాడు. అయితే, 66వ ఓవర్ చివరి బంతికి పాట్ కమిన్స్‌కు వికెట్ ఇచ్చాడు. సుందర్ కమిన్స్ బౌన్స్ బాల్‌పై పుల్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి బ్యాట్‌కు దగ్గరగా వెళ్లింది. దీనిపై ఆస్ట్రేలియా ఆటగాళ్లు అప్పీల్ చేయగా, మైదానంలోని అంపైర్ తిరస్కరించడంతో కంగారూ జట్టు కెప్టెన్ రివ్యూ తీసుకుని, స్నికోమీటర్‌ను పరిశీలించిన తర్వాత థర్డ్ అంపైర్ అతడిని ఔట్‌గా ప్రకటించాడు. ఈ వికెట్ తర్వాత సుందర్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. దీంతో మరోసారి వివాదాస్పద నిర్ణయంతో భారత బ్యాట్స్‌మెన్ వికెట్ కోల్పోవాల్సి వచ్చింది. వాషింగ్టన్ సుందర్ తొలగింపుపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో తన ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఇక్కడ అభిమానులు కూడా ఆస్ట్రేలియా జట్టును మోసగాళ్లు అంటూ ఆరోపిస్తున్నారు.

# స్టీవ్ స్మిత్, శుభ్‌మన్ గిల్ మధ్య స్లెడ్జింగ్




సిడ్నీ టెస్టు ఉద్రిక్త క్షణాలతో నిండిపోయింది, అందులో స్టీవ్ స్మిత్-శుభ్‌మన్ గిల్ మధ్య జరిగిన స్లెడ్జింగ్ పోటీ ముఖ్యమైనది. స్టీవ్ స్మిత్ స్లిప్స్‌లో తన చురుకైన మాటలతో గిల్‌ను డిస్టబ్ చేయడానికి ప్రయత్నించగా, గిల్ తన స్ట్రోక్స్‌తో ఎదురుదాడి చేశాడు. అయితే, చివరి సెకన్లలో నాథన్ లియాన్ బౌలింగ్‌లో గిల్ ఒక తప్పు చేస్తూ వికెట్‌ను కోల్పోయాడు. స్మిత్ స్లెడ్జింగ్ తర్వాత గిల్ ఔట్ కావడం వీడియోలో నమోదై అభిమానుల చర్చకు కారణమైంది. గిల్ నాటి ఇన్నింగ్స్‌లో బలమైన తీరు చూపినా, చివరికి సెషన్ చివరి బంతికి ఒక తప్పు చేస్తూ స్లిప్ ఫీల్డర్ చేతికి చిక్కాడు. దీనితో భారత జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఈ మధ్యకాలంలో భారత బ్యాటింగ్ లైనప్‌లో ముప్పు ఎక్కువగా కనబడుతోంది. పంత్ గాయపడినా మైదానంలో తన పోరాటాన్ని కొనసాగించాడు. అతని ధైర్యం ప్రశంసనీయం, అయితే టీమ్ ఇండియాకు విజయాన్ని అందించడానికి టాప్ ఆర్డర్ మెరుగైన ప్రదర్శన అవసరం.

## ఆ టైంలో గుండె రాయి చేసుకున్నా..!



ప్రేమ ఓ అద్భుతమైన అనుభూతి అయితే ఈ ప్రేమలో పడి విజయాన్ని సాధించిన వారు కొందరైతే ప్రేమ వల్ల ప్రేమించిన వారి వల్ల విరహ వేదన పొందిన వారు కొందరు. ఏ ఏజ్ లో వారైనా ప్రేమానుభూతి పొంది అది దక్కక పోతే వచ్చే బాధని అనుభవిస్తేనే తెలుస్తుంది. ఐతే తనకు అలాంటి ఒక ఫెయిల్యూర్ లవ్ స్టోరీ ఉందని చెబుతుంది అందాల భామ కథానాయిక రాశి ఖన్నా. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రాశి ఖన్నా అప్పటి నుంచి తన మార్క్ నటనతో ఆకట్టుకుంటూ వస్తుంది. తెలుగులో స్టార్ రేంజ్ కి వెళ్లలేకపోయింది కానీ ఒక మోస్తారు ఇమేజ్ తో నెట్టుకొస్తుంది. తెలుగుతో పాటు తమిళ హిందీ భాషల్లో కూడా రాశి ఖన్నా రాణిస్తుంది.


లేటెస్ట్ గా అమ్మడు ది సబర్మతీ రిపోర్ట్ సినిమాలో నటించింది. విక్రాంత్ మస్సే లీడ్ రోల్ లో నటించిన ఈ సినిమాను రంజన్ చందేల్ డైరెక్ట్ చేశారు. ఈ సినిమా ప్రమోషన్స్ లో రాశి ఖన్నా తన కెరీర్ ఇంకా పర్సనల్ లైఫ్ విషయాలను షేర్ చేసుకుంది. సౌత్ లో ఎన్నో సినిమాలు చేశా నటిగా తన అసలు ప్రయాణం మొదలైంది అక్కడే.. ఊహలు గుసగుసలాడే తర్వాత తిరుపతి వెళ్తే తనని అక్కడ జనాలు గుర్తించి తన చుట్టూ మూగారు. ఆ టైం లో తనకు ఏం జరుగుతుందో అర్థం కాలేదని మేనేజర్ చెప్పాక కానీ వాళ్లంతా తన కోసమే వచ్చారని అర్థం కాలేదని అన్నది రాశి ఖన్నా. అంతేకాదు పర్సనల్ గా తాను ఎమోషనల్ పర్సన్ అని. ఒకసారి ప్రేమలో కూడా ఫెయిల్ అయ్యానని అన్నది రాశి ఖన్నా. ఆ టైంలో తను చాలా బాధపడ్డానని మానసికంగా కుంగిపోయా ఆ తర్వాత తనను తానే మార్చుకుని స్ట్రాంగ్ గా మారానని చెప్పింది రాశి ఖన్నా. సెలబ్రిటీస్ అయినంత మాత్రాన వారికి లవ్ స్టోరీస్ ఉండవని కాదు. ప్రేమ ఎవరికైనా ఒకటే కదా.. బాధ కూడా ఒకటే. ఐతే కెరీర్ మీద దృష్టి పెట్టి తన ఫెయిల్యూర్ లవ్ ని మర్చిపోయానని చెప్పింది రాశి ఖన్నా. సినిమాల పరంగా సక్సెస్ రేటు ఎక్కువ లేకపోయినా రాశి ఖన్నా సౌత్ ఆడియన్స్ ని తన యాక్టింగ్ తో పాటు గ్లామర్ తో కూడా అలరిస్తుంది. ఐతే కెరీర్ ని స్ట్రాంగ్ చేసే మంచి పాత్రల కోసం ఎదురుచూస్తున్న అమ్మడికి అలాంటి ఛాన్స్‌లు రావట్లేదని చెప్పొచ్చు.

## నన్ను వేధించిన నాన్న చనిపోయాడని తెలిసింది: ఖుష్బూ



ప్రముఖ నటి , రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఇటీవల తన చిన్నతనంలో తనకు తండ్రి వల్ల ఎదురైన వేధింపుల గురించి తాజా ఇంటర్వ్యూలో మరోసారి మాట్లాడారు. 14 వయసులో తన తండ్రి చేతిలో లైంగిక వేధింపులకు గరయ్యానని, శారీరకంగా హింసించాడని ఖుష్బూ పేర్కొన్నారు. తన తల్లిని తీవ్రంగా శారీరక వేధింపులకు గురి చేసేవాడు. తన సోదరి సోదరుడిని కొట్టేవాడు. ఒకసారి అమ్మ తలను గోడకు బాదాడు. ఎదిగే క్రమంలో తాను ఎదుర్కొన్న బాధాకరమైన విషయాలను ఖుష్బూ వెల్లడించారు. తాజా ఇంటర్వ్యూలో తన తండ్రి గత ఏడాది చనిపోయారని తెలిసిన వారి ద్వారా తెలిసిందని కూడా ఖుష్బూ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అతడు బెల్టు, కట్టు, షూ హీల్స్‌తో కొట్టేవాడు. నా తల్లిని గోడకు కొట్టేవాడు. దారుణంగా దుర్భాషలాడేవాడు.. ఇవన్నీ భరించాము. కానీ 14 ఏళ్ల వయసులో మొదటిసారి అతడి వేధింపుల గురించి బహిరంగంగా మాట్లాడాను. సినీరంగంలోకి వచ్చిన తర్వాతే తనకు ధైర్యం వచ్చిందని ఖుష్బూ వెల్లడించారు. తాను నిజాలు బయటపెడితే తన తండ్రి తన కుటుంబ సభ్యులపై మరింత హింసాత్మకంగా వ్యవహరిస్తాడని భయపడినట్టు తెలిపారు. ఇంట్లోవారిని మరింత కొడతాడనే భయం నాలో ఉంది. అతడు నా సోదరులను, నా తల్లిని ఎలా కొడుతున్నాడో నేను ఇప్పటికే చూస్తున్నందున భారాన్ని భరించాననిపిస్తుందని ఖుష్బూ సుందర్ అన్నారు. జాను సినిమా సెట్స్‌లో తనతో కలిసి పనిచేసిన హెయిర్‌డ్రెస్సర్ ఉబిన్‌కి ఖుష్బూ ధైర్యం చెబుతూ సహాయం చేసింది. ఖుష్బూ విషయంలో ఆమె తండ్రి ప్రవర్తించే విధానాన్ని గమనించి ఏదో తప్పు జరిగిందని అనుమానించారు. చివరికి ఖుష్బూ తండ్రి తన కుటుంబాన్ని విడిచిపెట్టాడు. సెప్టెంబరు 1986లో మమ్మల్ని విడిచిపెట్టాడని ఖుష్బూ తెలిపారు. గత సంవత్సరం మరణించాడని ఇతరుల ద్వారా తెలిసిందని వెల్లడించారు. అతడు వెళ్లిపోయినప్పటి నుంచి ఎక్కడ కూడా నాకు తెలియదు. అప్పటి నుండి నేను అతనిని చూడలేదు అని ఖుష్బూ అన్నారు.

## రానా అమెజాన్ షో.. ఈసారి మరింత కొత్తగా..



టాలీవుడ్ ఇండస్ట్రీలో టాలెంటెడ్ స్టార్స్ లో ఒకరైన రానా అందరూ నడిచే దారిలో నడవడం లేదు. హీరోగా కొంత మార్కెట్ ఉన్నా కూడా ఏది పడితే అది చేయకుండా మనసుకు నచ్చితేనే గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నాడు. ఇక హోస్ట్ గా కూడా ఇప్పటికే అనేక షోలలో ఈవెంట్స్ లో సత్తా చాటాడు. ఫిల్మ్ ఫేర్ అవార్డుల వేడుకలో రానా స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తున్న విషయం తెలిసిందే. అలాగే నెంబర్ వన్ యారీ అంటూ అప్పట్లో ఒక షో చేశాడు. అయితే మళ్ళీ చాలా కాలం తరువాత రానా ఒక స్పెషల్ సెలబ్రేటీ షో ద్వారా హడావుడి చేయబోతున్నాడు. తెలుగు సినిమా ప్రేక్షకుల కోసం ప్రైమ్ వీడియో నుండి మరొక ప్రత్యేకమైన షో రాబోతోంది. నవంబర్ 23 నుండి 'ది రానా దగ్గుబాటి షో' ప్రైమ్ వీడియోలో ప్రేక్షకులను అలరించనుంది. ఈ షో రానా స్పిరిట్ మీడియా బ్యానర్‌పై నిర్మితమైంది. ఎనిమిది ఎపిసోడ్‌ల సిరీస్‌లో టాలీవుడ్ ప్రముఖులు తన జీవితంలో వ్యక్తిగత క్షణాలను పంచుకోనున్నారు. దుల్కర్ సల్మాన్, నాగ చైతన్య, సిద్దు జొన్నలగడ్డ, శ్రీలీల, నాని, ఎస్.ఎస్. రాజమౌళి, రామ్ గోపాల్ వర్మ వంటి టాప్ సెలబ్రిటీలు ఈ షోలో పాల్గొంటారు. సాధారణంగా టాక్ షోల్లో కనిపించే కార్యక్రమాలకు భిన్నంగా, ఈ షోలో నిజ జీవిత కథలు, ఆసక్తికరమైన ఆటలు, మనసుకు హత్తుకునే సంభాషణలు ఉంటాయని తెలుస్తోంది. రానా దగ్గుబాటి మిత్రులతో సరదాగా గడుపుతూ వారి జీవితంలోని ఇతర కోణాలను మన ముందుకు తీసుకురానున్నాడు. ప్రతి శనివారం కొత్త ఎపిసోడ్ విడుదలవుతుందని, ప్రపంచవ్యాప్తంగా 240 దేశాలలో అందుబాటులో ఉంటుందని ప్రైమ్ వీడియో ప్రకటించింది. ప్రైమ్ వీడియో ఇండియా ఒరిజినల్స్ అధిపతి నిఖిల్ మధోక్ మాట్లాడుతూ, "రానా సహజమైన చమత్కారంతో, నిజాయతీతో పర్సనల్ టచ్ ఇవ్వగలడని, ఈ షో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్న నమ్మకముంది" అని పేర్కొన్నారు. ఇక రానా మాట్లాడుతూ, నిజమైన అనుబంధాల గురించి మిత్రులతో సరదాగా నవ్వుతూ, కొత్త అనుభవాలను పంచుకోవడమే ఈ షో ప్రత్యేకత. ప్రియమైన ప్రేక్షకులు ఈ షోలోని అనూహ్యమైన, సరదా క్షణాలను ఆస్వాదించాలి" అని కోరుకుంటున్నాను అని రానా తెలిపారు. టాక్ షోలపై కొత్త కోణంతో రానా దగ్గుబాటి రూపొందించిన ఈ షో, టాలీవుడ్ స్టార్ల జీవితాలను డిఫరెంట్ గా చూపించనుందని అర్థమవుతుంది.

## బడా స్టార్స్ పై తాప్సీ మరో పంచ్..!



తెలుగులో ఝుమ్మందినాదం సినిమాతో పరిచయమై ఇక్కడ కొన్ని సినిమాలు చేసి వర్క్ అవుట్ అవ్వట్లేదని బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది తాప్సీ పన్ను. బాలీవుడ్ లో ఇంపాక్ట్ ఉన్న సినిమాలు చేస్తూ సత్తా చాటింది. తను చేస్తున్న సినిమాలే కాదు బాలీవుడ్ కి వెళ్లాక తాప్సీ చేస్తున్న కామెంట్స్ కూడా బోల్డ్ గా ఉన్నాయి. బాలీవుడ్ స్టార్స్ పై కంగనా తర్వాత ఆ రేంజ్ లో టార్గెట్ చేస్తూ కామెంట్ చేసే తాప్సీ లేటెస్ట్ గా మరోసారి వారిపై పంచ్ వేసింది. బడా స్టార్స్ సినిమాల్లో కథానాయిక ఎంపిక వారి ఇష్టమే అని అన్నది తాప్సీ అంతేకాదు స్టార్స్ ని ఓవర్ షాడో చేసే హీరోయిన్స్ కు వారు ఛాన్స్ ఇవ్వరని బాంబ్ పేల్చింది. ఏ స్టార్ అయినా సినిమాలో తమకన్నా ఎక్కువ నటించే లేదా తమని దాటి అభినయించే నటీమణిని వద్దంటాడా సినిమాకు ఏది అవసరమో అది తీసుకుంటారు కద. మరి తాప్సీ ఈ కామెంట్స్ తనకు ఎదురైన అనుభవాల వల్ల చెప్పిందేమో కానీ సినిమాకు ఉపయోగపడే అలాంటి విషయాల్లో స్టార్స్ అలా చేస్తారంటే నమ్మేలా లేదు.

ఇక తాప్సీ చేసిన జుడ్వా, డుంకీ సినిమాలో కూడా ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకోలేదని. ఎందుకంటే స్టార్ సినిమాల్లో నటిస్తే ఎక్కువ రెమ్యునరేషన్ ఇచ్చారు కాబట్టి నటించింది అన్న పేరు తనకు వద్దని రెమ్యునరేషన్ తను ఎప్పుడు తీసుకునేంత తీసుకున్నానని అన్నది తాప్సీ. ఎక్కువ రెమ్యునరేషన్ ఇచ్చి వాళ్లు మళ్లీ తనని మాట అనేలా చేసుకోకూడదని తాప్సీ అలా చేసిందని అంటుంది. ఏమైనా తన మాటల్లో కరుకుదనం చూస్తుంటే తాప్సీకి బాలీవుడ్ స్టార్స్ నుంచి బాద అనుభవించిందని అనిపిస్తుంది. ఐతే తాను చెప్పాలనుకున్న మాటని ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పే తాప్సీ ప్రస్తుతం సినిమాల విషయాల్లో కూడా ఆచి తూచి అడుగులేస్తుంది. బాలీవుడ్ పరిశ్రమ గురించి అక్కడ బడా హీరోయిన్స్ కూడా మాట్లాడటానికి వ్యతిరేకిస్తారు కానీ కంగన రనౌత్, తాప్సీ లాంటి వారు మాత్రం అక్కడ జరుగుతున్న విషయాలను కచ్చితంగా చెప్పాలని చూస్తారు. అందుకే ఇలాంటి వారికి అక్కడ మంచి ఫ్యాన్ బేస్ ఉంటుంది. సౌత్ నుంచి బాలీవుడ్ వెళ్లి సక్సెస్ అయిన వారిలో తాప్సీ ఒకరు. అందుకే ఆమె అక్కడే సినిమాలు చేస్తూ కెరీర్ కొనసాగిస్తున్నారు. కమర్షియల్ సినిమాల్లో నటించడం కన్నా తమకు నచ్చిన కథల్లో నటించడం ముఖ్యమని భావించే వారిలో తాప్సీ ఒకరు. అందుకే బాలీవుడ్ లో ఆమెకు స్పెషల్ క్రేజ్ ఏర్పడింది.